


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 1 జనవరి 2026 | 12 పేజీలు


### ఉద్యమకారులకు 250 గజాల

# భూమి ఇచ్చే వరకు పోరాటం

- తెలంగాణ జాగృతీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- మళ్ళీ కమిటీలు అంటూ కాలయాపన చేస్తే ఉరుకునేది లేదు.
- ఇస్తామన్న పెన్షన్, సంక్షేమ బోర్డు, భూమి వెంటనే ఇవ్వాలి.
- ప్రభుత్వం దిగి వచ్చే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతుంది.
- అవసరమైతే ఎక్కడికక్కడ భూములు ఆక్రమించుకోవాలి







**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

తెలంగాణ వచ్చిక కూడా ఉద్యమకారులకు న్యాయం జరగకపోవడంతో మళ్ళీ పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ జాగృతీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కరీంనగర్‌లో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి నిర్వహించిన భూ పోరాటంలో ఆమె పాల్గొని మాట్లాడూతూ ప్రభుత్వం(మిగతా 2లో)



### సంక్రాంతి లోగ సిరిసిల్లలో

## 'వర్కర్ టు ఓనర్' అమలు చేయాలి

- ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అల్టిమేటం
- లేదంటే 10 వేల మందితో మహాధర్నా
- నేతన్నలను ఆసాములుగా మార్చే పథకాన్ని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తుందని ధ్వజం

**సూర్య రాజన్న సిరిసిల్ల**

2లో



### కరీంనగర్ కార్పొరేషన్‌పై

## కాషాయ జెండా ఎగరేస్తాం

- మున్సిపాలిటీల్లోనూ ప్రజలంతా బీజేపి వైపు చూస్తున్నారు.
- టిక్కెట్లు రానివారికి పార్టీ, నామినేటేడ్ పదవుల్లో సర్దుబాటు చేస్తాం
- మున్సిపాలిటిల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే..
- కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజిలో వేసినట్లే
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

2లో

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**










నూతన సంవత్సర శుభాకాంక్షలు




TEA KINGS
Koduri Laxman goud
CHAIRMAN
Hyderabad
Branch office:- Karimnagar

# ఉద్యమకారులకు 250 గజాల భూమి ఇచ్చే వరకు పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల స్థలం, పెన్షన్, సంక్షేమ బోర్డు హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మళ్లీ కమిటీలు అంటూ కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఊరి ప్రజలు చెప్పిన ఉద్యమకారుల పేర్లనే జాబితాలో చేర్చాలని సూచించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతుందని, అవసరమైతే ఎక్కడికక్కడ భూములను ఆక్రమించుకోవాలని ఉద్యమకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు లకవత్ రూప్ సింగ్, జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి, జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి తదితర నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# సంక్రాంతిలోగా సిరిసిల్లలో 'వర్కర్ టు ఓనర్' అమలు చేయాలి

**- ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అల్టిమేటం - లేదంటే 10 వేల మందితో మహా ధర్నా**

**- నేతన్నలను ఆసాములుగా మార్చే పథకాన్ని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తోందని ధ్వజం**

**సూర్య రాజన్న సిరిసిల్ల.**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేత కార్మికుల తలరాతను మార్చే 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని సంక్రాంతి పండుగలోపు అమలు చేయాలని, లేనిపక్షంలో 10 వేల మందితో మహా ధర్నా చేపడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం సిరిసిల్లలోని అప్పరల్ పార్కును ఆయన సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా ఈ పథకాన్ని ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. సంక్రాంతి లోపలే అర్హులైన నేత కార్మికుల జాబితాను (ఆసాముల లిస్టు) ఫైనల్ చేసి, వారికి కేటాయింపు పత్రాలు అందజేయాలని,వచ్చే బడ్జెట్లో సబ్సిడీ పవర్ లూమ్లు కోసం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం 400 కోట్లతో నిర్మించిన అపెరల్ పార్క్ షెడ్లు నేడు నిరుపయోగంగా మారి, పిచ్చిమొక్కలతో నిండిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన షెడ్లను వడ్ల నిల్వలకు వాడటం ప్రభుత్వ అవివేకానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్ల ద్వారా నేతన్నల ఆదాయం 20 వేలకు పెరిగిందని, మహిళలకు బీడీ కార్మికుల పెన్షన్లు అందాయని గుర్తు చేశారు. కార్మికుడే యజమాని కావాలన్న లక్ష్యంతో తెచ్చిన ఈ పథకాన్ని కాంగ్రెస్ పక్కన పెట్టడం దారుణమన్నారు. ఒకవేళ ప్రభుత్వం మొద్దునిద్ర వీడకపోతే, సంక్రాంతి తర్వాత సిరిసిల్ల పట్టణం కదిలేలా, వేల సంఖ్యలో కార్మికులతో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. 2005లో నేతన్నల ఆత్మహత్యల సమయంలోనే కేసీఆర్ 50 లక్షల సాయం చేసి అండగా నిలిచారని, స్వరాష్ట్రంలో సిరిసిల్లను వస్త్ర ఉత్పత్తి కేంద్రంగా మార్చారని కేటీఆర్ కొనియాడారు. ఇక్కడ తయారైన వస్త్రాలు న్యూయార్కు ఎగుమతి కావడం కేసీఆర్ సంకల్పమేనని, అటువంటి అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటోందని ధ్వజమెత్తారు. అంతకుముందు అంతకుముందు కేటీఆర్ సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్లో నిర్వహించిన కేటీఆర్ కప్ క్రికెట్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్రావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, వై చైర్మన్ మంచే శ్రీనివాస్ లతోపాటు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ కార్పొరేషన్పై కాషాయ జెండా ఎగరేస్తాం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్తో పాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో కాషాయ జెండా ఎగరేయడమే బీజేపీ లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్లోని త్రిధా హోటల్లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. టిక్కెట్ల విషయంలో పైరవీలు, మొహమాటాలకు తావులేదని, సర్వే ఆధారంగా గెలుపు అవకాశమున్న వారికే బీజేపీ టిక్కెట్లు కేటాయిస్తుందని తెలిపారు. టిక్కెట్లు ఇప్పిస్తామని ఎవరు చెప్పినా నమ్మవద్దని, ఒత్తిడి చేస్తే టిక్కెట్లు కూడా రావని హెచ్చరించారు. టిక్కెట్లు రాకపోయినా పార్టీ, నామినేటెడ్ పదవుల్లో సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో గొడవలు పెట్టుకునే నేతలను ఉపేక్షించబోమని, వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని అన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే జరుగుతోందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. బీఆర్ఎస్కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లేనని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**-వైద్యులు కచ్చితంగా సమయ పాలన పాటించాలి -పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**సూర్య-గోదావరిఖని:**



పట్టణంలోని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిఖని పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు సమయ పాలన పాటిస్తూ.. విధులకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వాల ఆలోచనను సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని గుర్తు చేశారు. జనరల్ ఆసుపత్రి లోని క్రిటికల్ కేర్, ఆర్థోపెడిక్ సర్జరీ బ్లాక్ లను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు రాకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తగా సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాళ్ సింగ్, ఆర్ఎంఓ డాక్టర్ డాక్టర్ కృపా బాయి, డాక్టర్ రాజు తదితరులు ఉన్నారు.

# నడి రోడ్డుపై వ్యక్తి దారుణ హత్య

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని గణేశ్ టెంపుల్ సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం ఓ వ్యక్తి ఆర్థిక లావాదేవిల నేపథ్యంలో దారుణ హత్య కు గురయ్యాడు. పట్టణంలోని గోవిందుపల్లికి చెందిన కొలగాని అంజయ్య (56) అనే వ్యక్తిని ముగ్గురు వ్యక్తులు అందరూ చూస్తుండగానే బండరాళ్లు ఎత్తి వేసి హతమార్చారు. అప్పు ఇచ్చి అడిగినందుకు జరిగిన గొడవలో హతమార్చినట్లు తెలుస్తోంది. ఇంటికి వెళ్లి ఇచ్చిన అప్పు అడగగా గొడవ జరిగిందని, ఈ క్రమంలో అంజయ్య పై దాడికి పాల్పడ్డారని స్థానికంగా ప్రచారం జరుగుతుంది. వారి నుంచి తప్పించుకొని ప్రధాన రహదారిపై పరిగెత్తుకొని వచ్చినప్పటికీ వెంటపడి బండలు ఎత్తేసి చంపారు. ఈ ఘటనపై జగిత్యాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పిచ్చి మొక్కలు తొలగింపు...

**సూర్య - పెద్దపల్లి రూరల్**



మండలం లోని మూలసాల గ్రామంలో ప్రధాన రహదారి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు సర్పంచ్ జూపాక శ్వేత వెంకటేష్ సూచన మేరకు బుధవారం సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నాయనే విషయాన్ని గ్రామస్తులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదాలు లేకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేశవేని అశోక్ , వార్డు మెంబర్లు ఉషణ మల్లయ్య , కారే మహేందర్,పోతుల ప్రవీణ్ కుమార్,జూపాక సమత , గ్రామ ప్రజలు పాలక వర్గం ఉన్నారు.



# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**సూర్య, హుజురాబాద్**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాంటిస్సోరి ప్రిన్సిపాల్ గీతాషాజు అన్నారు. బుధవారం పట్టణంలోని కాకతీయ కాలనీకి చెందిన మహమ్మద్ నూరిన్ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత నెల డిసెంబర్ 25న వనపర్తిలో జరిగిన అండర్ - 14 హాకీ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభను కనపరిచినందుకు జనవరి 2 వ తేదీన మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్ లో జరిగే జాతీయ స్థాయి అండర్ - 14 బాలికల హాకీ పోటీల్లో ఎంపిక కావడం అభినందనీయమన్నారు. నూరిన్ ను స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు క్రీడాకారులుగా తయారు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ షాజూ థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సంవత్సర వేడుకల కోసం...

**సూర్య, హుజురాబాద్**

కొత్త సంవత్సర వేడుకల కోసం బేకరీలు, హోటళ్లు, కుంకుమ దుకాణాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మహిళలు ప్రతి ఇంటి ముందు అందమైన ముగ్గులు వేయడం ఆనవాయితీ. అందమైన ముగ్గుల కోసం వివిధ రకాలైన రంగులను కొనుగోలు చేసి మహిళలు ముగ్గులు వేస్తారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో నూతన సంవత్సర వేడుకల కోసం బేకరీల ముందు కేకులను ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను ఆకట్టుకోవడానికి బేకరీల దుకాణాల ముందు టెంట్లు లైట్లు వేసి ఆఫర్లు ఇస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల వద్ద బిర్యానీ ప్యాకెట్లు, రుమాల్ రోటి అమ్మకాలకు సిద్ధం చేశారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసులు పలు ఏర్పాట్లను చేశారు.





నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

రాజన్నసిరిసిల్ల

గురువారం 1 జనవరి 2026




### నిష్పక్ష వార్తలతో
# 'సూర్య దినపత్రిక'కు పాఠకుల ఆదరణ
## - ప్రజా సమస్యల పరిష్కారంలో మరిన్ని విజయాలు అందుకోవాలి
## - ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ - సూర్య దినపత్రిక -2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్య, వేములవాడ**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం తన నివాసంలో సూర్య దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం లో పత్రికలు వారధిగా నిలవాలని ఆకాంక్షించారు. సూర్య దినపత్రిక అనతి కాలంలోనే తనదైన ముద్ర వేసుకుందని, నిష్పక్షపాత వార్తలతో పాఠకుల ఆదరణ పొందుతోందని



ఆయన కొనియాడారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు లోటుపాట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నూతన సంవత్సరంలో సూర్య పత్రిక మరిన్ని విజయాలు సాధించి, సామాన్య ప్రజల గొంతుకగా నిలవాలని కోరుతూ పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, జిల్లా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూర్య పత్రిక ప్రతినిధి రఫీ, పాశం భాస్కర్ రెడ్డి, వెంకటేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, పులి రాంబాబు గౌడ్, పీర్ మహమ్మద్, మైలారం రాము తదితరులు ఉన్నారు.

# అలుగునూరు ప్రతిభా కేంద్రాన్ని కాపాడాలి
## - జీవో 78 ప్రకారం పాఠశాలను నడపాలి - దళిత నిరుపేద విద్యార్థులకు తీవ్ర నష్టం
## - పాఠశాలను యధావిధిగా కొనసాగించాలి - ప్రభుత్వ విప్‌కు బహుజన విజ్ఞప్తి

**సూర్య, వేములవాడ**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టిజిఎస్డబ్ల్యూఆర్ఎస్ సిఓఈ అలుగునూరు ప్రతిభా కేంద్రాన్ని జీవో ఎంఎస్ నంబర్ 78 ప్రకారం నడపాలని బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్కు వినతి పత్రం అందజేశారు. గత 18 సంవత్సరాలుగా నడిపిన విధంగానే రాబోవు విద్యా సంవత్సరం (2026-2027) నుండి నడిపించాలని కోరారు. ఈ కళాశాల నుండి వెళ్లిన విద్యార్థులు ఎందరో ఐఐటి, ఎన్ఐటిలలో అడ్మిషన్లను పొంది అత్యున్నత ప్రమాణాలతో వారి ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. 2025 ఏప్రిల్ మాసంలో ప్రకటించిన ఎస్ఎస్సి ఫలితాలలో సొసైటీ స్థాయిలో రాష్ట్రంలోనే ఈ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందని, అంతేకాకుండా ఈ విద్యా సంవత్సరంలో జాతీయస్థాయిలో ప్రకటించిన ఐఐటి మెయిన్స్ ఫలితాలలో దాదాపు 37 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారంటేనే ఈ కళాశాలలో ఎంతటి



నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్య అందజేయబడుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు ఇంత గొప్ప లక్ష్యాలను సాధిస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకే కాకుండా రాష్ట్రానికి జాతీయ స్థాయిలో ప్రతిష్టను తీసుకు వస్తున్నటువంటి ఈ పాఠశాలను నిర్వీర్యం చేసే విధంగా గత సెక్రటరీ అలుగు వర్షిని తన ఏకపక్ష నిర్ణయాలతో ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘన చేసి కేవలం బాలికలకే కేటాయించి, ఈ కళాశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ/అధ్యాపకులను వివిధ పాఠశాలలకు బదిలీపై పంపించి, తాత్కాలిక ప్రాతిపదికన బోధించే ప్రైవేటు ఉపాధ్యాయ/అధ్యాపకుల చేత బోధన చేయిస్తున్నారని తెలిపారు. దళిత నిరుపేద విద్యార్థులకు తీవ్ర నష్టం చేకూర్చారని, ప్రస్తుతం ఈ విద్యాసంస్థ తన పూర్వ ప్రతిష్టను కోల్పోయే స్థితిలో ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశం కల్పించేందుకు తర్ఫీదును ఇచ్చే ఈ పాఠశాలను కేవలం బాలికలకే కేటాయించి, ప్రైవేటు వారి చేత బోధన చేయిస్తూ, బాలురకు అత్యుత్తమ విద్యాసంస్థను దూరం చేయడమే కాకుండా, ప్రస్తుతం చదువుతున్న బాలికలకు అత్యంత అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ అధ్యాపకులను దూరం చేసి తీవ్ర మైనటువంటి అన్యాయం చేశారని వాపోయారు. ఇప్పటికైనా జరిగిన నష్టాన్ని సవరించి, యధావిధిగా కళాశాలను నడిపేందుకు తగిన చర్యలను ప్రభుత్వపరంగా తీసుకొని, దళిత విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యానికి అనుగుణంగా యధావిధిగా కొనసాగించేందుకు ఉమ్మడి జిల్లాలోని ముఖ్య నాయకులందరూ ఏకతాటిపై ఉండి ఈ విద్యాసంస్థను కాపాడాలని కోరారు.

## సాగునీటి కష్టాలు తీరేనా..?
### - చెంతనే నీరు ఉన్నా రైతులకు తీరని చింత
### - బంధనకల్ నూతన సర్పంచ్ చిగురు నరేష్

**సూర్య, ముస్తాబాద్**

సాగునీటికై సాగిన సర్పంచ్ చిగురు నరేష్ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం లోని బంధనకల్ గ్రామంలోని రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నూతనంగా ఎన్నికైన బంధనకల్ సర్పంచ్ చిగురు నరేష్ వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఐన ఆది శ్రీనివాస్‌నీ కలిసి పన్నెండవ ప్యాకేజీ 6r కాలువను మరమ్మత్తు చేసి బంధనకల్ గ్రామం తో పాటు మరో ఐదు గ్రామాల కు సాగునీటి సమస్యను తీర్చాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీటి కొరత తీవ్రంగా ఉన్న తన గ్రామానికి నీటిని అందించి సమస్య పరిష్కారం చేయాలని, రాబోవు వేసవికాలంలో వేసే వరి పంటలను దృష్టిలో ఉంచుకొని మరమ్మత్తులో ఉన్న కోమటి చెరువు ధమ్మ చెరువు మధ్యలో గల చింతమడక కాలువ వద్ద గల దాదాపు పది మీటర్ల పొడవు గల తెగిన కాలువను పూడిస్తే కాళేశ్వరం నుండి వచ్చే నీరు మానాపూర్ శంకర్ నగర్ వెంకట్రావుపల్లి బంధనకల్ మొర్రాపూర్ రాజక్క పేట గ్రామాలకు సాగునీరు అంది, అది గ్రామంలోని పంట భూములను సస్యశ్యామలంగా చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బంధనకల్ సర్పంచ్ చిగురు నరేష్ వెంకట్రావు పల్లె సర్పంచ్ సురభి దశరథరావు మొర్రాపూర్ సర్పంచ్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### - ఏఎస్పి రుత్విక్ సాయి
### - పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఏఎస్పి

**సూర్య, రుద్రంగి**



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఏఎస్పి రుత్విక్ సాయి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను ఏఎస్పీ రుత్విక్ సాయి బుధవారం సందర్శించి పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిబ్బంది పనితీరు, స్టేషన్ లోని నమోదు అవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారని అలాంటి వాటిపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్లో భాగంగా విలేజ్ పోలీస్ అధికారులు తరుచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ ప్రజలకు సైబర్ నేరాలు, గంజాయి, ట్రాఫిక్ నియమాలు, బెట్టింగ్ యాప్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెడుతూ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలు న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతగా జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం బడి తండా దెగవత్ తాండ గ్రామపంచాయతీలో పర్యటించి యువకులకు, గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యువకులకు వాలీబాల్ కిట్టు ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాణినికేతన్ హైస్కూల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

**సూర్య,ఇల్లంతకుంట**



మండల కేంద్రంలోని వాణి నికేతన్ హైస్కూల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులు కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొత్త ఆంగ్ల సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు రావాలన్నారు. గత సంవత్సరపు అనుభవాల పునాదులపై నూతన లక్ష్యాలను నిర్ణయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు సంతోష్, రాజు, రమేష్, తిరుపతి, రాజు, శ్రీనివాస్, సుమంగళి, శోభ, రేఖ,మహాలక్ష్మి,లావణ్య,సునంద, మౌనిక, కళ్యాణి, రేణుక, షమీమా స్వాతి,జలజ,రేణుక,శాంత,పద్మ,సునీతలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య పరామర్శ

**సూర్య, తంగళ్లపల్లి**



తంగళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన బుస్స రాజేశం,ఒగ్గు కుంటయ్యలు, రాళ్లపేట గ్రామానికి చెందిన గౌరు శంకర్ లు మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం కల్పించిన మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య.అలాగే గత రెండు రోజుల క్రితం వైద్యం వికటించి మృతి చెందిన మహమ్మద్ హమీద్ కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు 3000 వేల రూపా యల ఆర్థిక సాయం కోడి అంతయ్య అందజేశారు.ఈ సందర్భంగా నిరు పేద హమీద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.అంతయ్య వెంట తంగళ్ళపల్లి ఉపసర్పంచ్ ఆసాని శ్రీకాంత్ రెడ్డి,వార్డు మెంబర్ తాటికొండ చందు సాయిలున్నారు.

# పోస్ట్ గ్రాడ్యుయేట్...చేసేది బ్లడ్ ఆర్ట్....!

**- యూత్ క్రేజ్ ను వృత్తిగా స్వీకరణ - జగిత్యాలలో ట్రెండ్ సెట్ చేసిన యువ ఆర్టిస్ట్**

**- ప్రముఖుల చిత్రాలు రక్తంతో గీసి మన్ననలు పొందిన కళాకారుడు - నిరుద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్న సాయి ప్రవీణ్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

ఆ యువకుడు ఎంబిఏ చదివి ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడలేదు. అలాగని అనుభవం లేని వ్యాపారాలు చేసి నష్టాల బాట పట్టలేదు. ప్రైవేటు ఉద్యోగం కోసం పాకులాడలేదు. చదువుకు సంబంధం లేని వృత్తిని ఎంచుకుని తనదైన శైలిలో ట్రెండ్ సెట్ చేయడమే కాదు. లక్షలు గడిస్తూ ఎందరో నిరుద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. కొత్తగా ఆలోచించి యువతకు ఉన్న క్రేజ్ ను గుర్తించి తన వ్యాపారానికి అదే క్రేజ్ ను పెట్టుబడిగా పెట్టి రోజుకు 16 గంటలు కష్టపడుతూ కార్పొరేట్ స్థాయి సాఫ్ట్ వేర్ ఉద్యోగి కూడా పొందని వేతనాన్ని స్వంతంగా సంపాదిస్తున్నాడు. పెన్సిల్ ఆర్ట్, టట్టూస్, బ్లడ్ ఆర్ట్ వేసి కస్టమర్లతో పాటు ప్రముఖుల మన్ననలు పొందుతున్నాడు. జగిత్యాలకు చెందిన పోనగంటి సాయి ప్రవీణ్ అనే యువకుడు ఎంబిఏ వరకు చదివాడు. తన తండ్రి పోనగంటి ఆంజనేయులు చేసిన చేతి వృత్తిని స్ఫూర్తిగా తీసుకుని తన బావ హరీష్ వద్ద చూసి చిత్ర కళ పట్ల ఆకర్షితుడయ్యాడు. మొదట్లో సరదాగా టట్టూస్, పెన్సిల్ ఆర్ట్ వేసేవాడు. కాగా చిత్ర కళపై పట్టు సాధించిన సాయి ప్రవీణ్ జగిత్యాల జిల్లా కేంద్రంలోని నటరాజ్ థియేటర్ సమీపంలో 6 సంవత్సరాల క్రితం టట్టూస్ వేసే పాయింట్ ను ఏర్పాటు చేశాడు. తర్వాత యువతకు ఉన్న ఆసక్తిని గుర్తించి నిపుణుల వద్ద శిక్షణ పొంది బ్లడ్ ఆర్ట్ ను వేయడం ప్రారంభించాడు. ఈ ఆరు సంవత్సరాల కాలం లో సుమారు 7000 వరకు టట్టూస్ వేసి, ఒక సంవత్సరం క్రితం బ్లడ్ ఆర్ట్ ప్రారంభించాడు. ఈ సంవత్సర కాలంలో సుమారు 100 వరకు బ్లడ్ ఆర్ట్ లు వేసినట్టు సాయి ప్రవీణ్ తెలిపాడు.

**మదిలో బావాలు వ్యక్తపరిచే సులువైన మార్గం బ్లడ్ ఆర్ట్**





గతంలో ప్రేమికులు తమ ప్రేమను వ్యక్తపరిచేందుకు రక్తంతో ప్రేమ లేఖలు రాసేవారు. కాలక్రమంలో తమకు ఇష్టమైన వారి రూపాన్ని తమ రక్తంతో చిత్రాన్ని గీయించి వారికి గిఫ్ట్ గా ఇస్తూ బంధాలను బలపరుచుకుంటున్నారు. ఈ క్రమంలోనే బ్లడ్ ఆర్ట్ కు క్రేజ్ రోజురోజుకు పెరిగిపోతుంది. అయితే అచ్చు గుద్దినట్టు చిత్రాన్ని అదికూడా రక్తంతో గీయడం అందరికి సాధ్యం కాదు. అందుకు చిత్ర కళలో మంచి పట్టు ఉండాలి, చిత్రాన్ని గీయడంలో నేర్పు ఉండాలి. అలాంటి కఠినమైన కళను వృత్తిగా ఎంచుకున్న సాయి ప్రవీణ్ ను పలువురు అభినందిస్తున్నారు.

**నిపుణుల పర్యవేక్షణలో రక్తం సేకరణ**

సాయిప్రవీణ్ బ్లడ్ ఆర్ట్ వేయడం కోసం అర్హత గల ల్యాబ్ టెక్నిషియన్ల ద్వారా తగు జాగ్రత్తలు పాటించి రక్తాన్ని సేకరిస్తాడు. ఆర్ట్ వేసే సమయంలో కూడా అప్రమత్తంగా ఉండి చిత్రంలో జీవ కళ ఉట్టిపడేలా వ్యవహరించడంలో దిట్టగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఒక్కో బ్లడ్ ఆర్ట్ వేయడానికి సుమారు గంట సమయం పడుతుందని సాయి ప్రవీణ్ తెలిపాడు.

**ప్రముఖుల దృష్టిని ఆకర్షిస్తున్న బ్లడ్ ఆర్ట్**

జగిత్యాలలో సాయి ప్రవీణ్ వేస్తున్న బ్లడ్ ఆర్ట్ ప్రముఖుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ప్రముఖ వైద్యుడు డా. వాసాల శ్రీధర్ ల పెన్సిల్ ఆర్ట్ గీసి వారి మన్ననలు పొందిన సాయి ప్రవీణ్ డా. ఎల్లల శ్రీనివాస్ రెడ్డి, మరికొందరి చిత్రాలు రక్తంతో వేసి పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

**యూత్ న్యూ ట్రెండ్ బ్లడ్ ఆర్ట్**

**- సాయి ప్రవీణ్, ఆర్టిస్ట్**

ప్రస్తుతం యూత్ ను ఆకర్షిస్తున్న న్యూ ట్రెండ్ బ్లడ్ ఆర్ట్. ప్రముఖులతో పాటు ఫ్యామిలీలో



ఇష్టమైన వారి చిత్రాలను బ్లడ్ ఆర్ట్ గా వేయించుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇప్పటికే టట్టూస్ పట్ల మంచి క్రేజ్ ఉండగా బ్లడ్ ఆర్ట్ ను కూడా యువత ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం నెలలో సుమారు 20 వరకు బ్లడ్ ఆర్ట్ లు వేస్తున్నాను. పెన్సిల్ ఆర్ట్, టట్టూస్ కు కూడా మంచి డిమాండ్ ఉంది. మా నాన్న ఆంజనేయులు ఇచ్చిన స్ఫూర్తితో బావ హరీష్ ప్రోత్సాహంతో ఈ వృత్తిని ఎంచుకున్నాను. యువత నిరుద్యోగంతో నిరాశకు గురికాకుండా తమలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ఎలాంటి అడ్డంకులు ఉండవని నా అభిప్రాయం

## కేంద్ర ప్రభుత్వము అన్వేష్‌ను దేశానికి రప్పించి దేశద్రోహం కేసు పెట్టాలి

**- భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు, చెట్ల గంగాధర్ మాట్లాడుతూ గత కొన్ని రోజుల కింద సినీ యాక్టర్ శివాజీ మహిళల వస్త్రాధారణ గురించి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ నా అన్వేషణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా యాత్రలు చేస్తున్న అన్వేష్ అనే యాత్రికుడు హిందూ దేవతలైన సీతా ద్రౌపదీమాతలను అవమానకరంగా మాట్లాడడమే కాకుండా దేశాన్ని కూడా కించపరిచే విధంగా మాట్లాడటం జరిగిందని హిందువులందరూ రేపిస్టులని మహిళలను రేపులు చేసే వాళ్లంతా హిందువులేనని చాలా దారుణమైన వ్యాఖ్యలు చేశాడని ఇలాంటి వాడి పాస్పోర్ట్ క్యాన్సల్ చేసి దేశానికి రప్పించి కఠినంగా శిక్షించాలని కోరారు హిందువులు సంఘటితం కాకపోతే ప్రతి ఒక్కరు ఇలా హిందూ మతం మీద విషం కక్కుతూనే ఉంటారని ఇకనైనా హిందువులు జాగృతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు చిట్ల గంగాధర్ నాయకులు సింగం గంగాధర్ గాదాసు భూమన్న కొత్తకొండ బాలన్న ఎడమల వెంకటరెడ్డి నరేందుల శ్రీనివాస్ బొందుకూరి శ్రీనివాస్ బాశెట్టి ప్రభాకర్ భాశెట్టి దుబ్బ రాజం పరంకుశం నరేందర్ సిరిపురం గంగారం వున్నారు

## అసెంబ్లీలో పెన్షనర్ల బకాయిల విడుదల ప్రకటించాలి

**టీ.పీ.సి.ఏ.రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**



**సూర్య జగిత్యాల ప్రతినిధి**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెన్షనర్లకు ఇచ్చిన హామీల మేరకు పెండింగ్ బకాయిల విడుదల,పీ.ఆర్.సి.మంజూరు అసెంబ్లీలో ప్రకటించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం టీ.పి.సి.ఏ.ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల పక్షోత్సావాలు నిర్వహిస్తున్న సందర్భంగా అసోసియేషన్ కార్యాలయంలో జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన 24 మంది ఉద్యోగులను హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా ఘనంగా పట్టు శాలువలు కప్పి, మెమెంటోలు,డైరీలను అందించి సన్మానించారు.అనంతరం 2025 సంవత్సరంకు వీడ్కోలు,2026 సంవత్సరంకు స్వాగతం వేడుకలతో పాటు పెన్షనర్ల జిల్లా సంయుక్త కార్యదర్శి ఎమ్.డి.ఇక్బాల్ 70 వ జన్మదిన వేడుకలు,జాతీయ పెన్షనర్ల పక్షోత్సావాలు నిర్వహించారు.ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 1 నుంచి రిటైర్మెంట్ అయిన వారికి ఇంకా అందని ప్రయోజనాలు,పెండింగ్ బకాయిలు వెంటనే క్లియర్ చేయాలని,పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని,మెరుగైన ఫిట్మెంట్ తో పీ ఆర్.సీ.మంజూరు చేయాలని,ఈ.హెచ్.ఎస్.పథకంను అమలుచేయాలని డిమాండ్ చేశారు. బెనిఫిట్స్ రాక 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో పెన్షనర్లు పోరుబాట పట్టకుండా చూడాల్సిన భాద్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి టీ.ఈ.జి.జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సి.హన్మంత రెడ్డి,రిటైర్డ్ జిల్లా అటవీ శాఖాధికారి పూసాల అశోక్ రావు,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథము,ఉపాధ్యక్షులు వెల్మల ప్రకాష్ రావు, కె.సత్యనారాయణ, ఎమ్.డి.యాకుబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు సయ్యద్ యూసుఫ్, విజయలక్ష్మి, బొబ్బాటి కరుణ,కట్ట గంగాధర్,నాయిని సంజీవ రావు,,దిండిగాల విఠల్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,మెట్ పల్లి అధ్యక్షుడు కుందేళ్ల మురళి,రాయికల్ అధ్యక్షుడు ఏనుగంటి రాములు,మల్యాల అధ్యక్షుడు ఎమ్.డి.యాకూబ్,కార్యదర్శి వీరారెడ్డి, జిల్లా,డివిజన్,వివిధ మండల యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కల్లెడ చిన్నారులకు చేయూత అందించిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి.

**సూర్య జగిత్యాల**



కల్లెడ గ్రామంలో తల్లిదండ్రులిద్దరిని కోల్పోయి అనాథలుగా మిగిలిన ముగ్గురు పిల్లల దీనావస్థ కు స్పందించిన జగిత్యాల కు చెందిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు నెలకు సరిపడా రేషన్ వస్తువులను అందించారు. వీరి బాగోగులను ప్రస్తుతం చూసుకుంటున్న ఆ గ్రామ మాజీ సర్పంచ్ అంకతి గంగాధర్ ని ప్రాథమిక వివరాలు తెలుసుకున్న సేవా సమితి బాధ్యులు కల్లెడ గ్రామానికి వెళ్లి వారిని స్వయంగా కలిసి వివరాలు సేకరించడం జరిగింది , ప్రస్తుతం ముసలితనం లో ఉన్న అమ్మమ్మ తాతయ్య వచ్చి వారితో ఉంటున్నారు.శ్రీ సత్యసాయి సేవా సంస్థ, జగిత్యాల ద్వారా భక్తులందరి సహకారం తో తక్షణమే స్పందించి వారికి ఒక నెలకు సరిపడే ఇరవై ఐదు కిలోల బియ్యం, అన్నిరకాల వంట సరకులను అందించడం జరిగింది. అలాగే పిల్లలకు స్నాక్స్, బ్లాంకెట్స్ ఇవ్వడం జరిగింది. పిల్లల చదువుల బాధ్యత స్వీకరిస్తామని వారికి భరోసా ఇవ్వడం జరిగింది. సంస్థ భక్తుల సహకారంతో ఇప్పటికే జమ అయిన దాదాపు 35,000 రూపాయలను ఇకముందు వచ్చే అమౌంట్ ను కూడా కలుపుకొని వారి బ్యాంకు అకౌంట్ ఓపెన్ అయ్యాక ఫిక్స్ డిపాజిట్ చేయడం వారికి ఇంకా ఏదైనా రూపంలో ఆ డబ్బులతో సహకారం అందించడం జరుగుతుందని సేవా సమితి బాధ్యులు తెలిపారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్ , ఉత్తూరి గంగాధర్ , ఠాకూర్ నారాయణ్ సింగ్ , పిప్పరి రాజేందర్ , వంగల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల సహకారం కొనసాగాలని, జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగుతూ జిల్లా అబివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.





నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

పెద్దపల్లి

గురువారం 1 జనవరి 2026




## 2025వ సంవత్సరంలో

# సింగరేణి సంక్షేమ పథకాలు ఇవే...

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో 2025వ సంవత్సరంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధిని సాధించింది. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం - 2024 కింద సివిల్స్ 2024 (మొదటి సంవత్సరం) ఎంపికైన 20 మంది అభ్యర్థులకు 05జనవరి 2025 న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మరో రూ.లక్ష చొప్పున ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. వీరిలో ఏడుగురు అభ్యర్థులు విజేతలుగా నిలవడమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో టాపర్గా (11 వ ర్యాంక్) నిలిచిన అభ్యర్థి కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందడం విశేషం. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం (2025) కింద సివిల్స్-2025 లో ఆగస్టు 11న ప్రిలిమ్స్ పాసైన 202 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహక చెక్కులను అందజేయడం జరిగింది. వీరిలో 50 మంది ఇంటర్వ్యూలకు ఎంపిక కావడం విశేషం వీరికి కూడా మరో రూ.లక్ష చొప్పున డిసెంబర్ 4, 2025 ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. జనవరి 6, 2025 న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు "చెమట చుక్కలకు తర్ఫీదు" అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా సింగరేణి కార్మికుల పిల్లలు మరియు పరిసర ప్రాంత యువతకు జాతీయ, అంతర్జాతీయ విద్యా, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. సింగరేణి సంస్థ తొలిసారిగా ఒక ప్రముఖ కన్సల్టెన్సీ భాగస్వామ్యంతో, కార్మిక కుటుంబాలకు సమగ్ర విద్య మరియు కెరీర్ విషయాల్లో మార్గనిర్దేశం చేయనుంది. సింగరేణి ఆధ్వర్యంలో కీలక ఖనిజాల రంగంలో తొలి అడుగుగా క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, పరిశోధన, ఉత్పత్తిలో సహకారం కోసం ఒడిశాలోని భువనేశ్వర్ లో ఉన్న సీఎస్ఐఆర్-ఐఎంఎంటీతో ఒప్పందం, హైదరాబాద్ లోని ఎన్ ఎఫ్ టి డి సి, ఐఐటీ లతో , నాగ్పూర్ లోని జేఎన్ఏఆర్డీడీసీలతో ఒప్పందం చేసుకోవడం జరిగింది.సింగరేణిలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులకు 40 లక్షల ఉచిత ప్రమాద బీమా పథకం అమలు (పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారితో ఒప్పందం)సింగరేణి 2x600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఆవరణలో కొత్త 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి బీహెచ్ఈఎల్ తో ఒప్పందం (40 నెలలలో పూర్తి చేయాలని ఆదేశం) సింగరేణి కీలక ఖనిజాల రంగంలోనూ ప్రవేశించడమే లక్ష్యంగా విదేశాల్లోనూ ఉన్న అవకాశాలపై పరస్పర సహకారంలో భాగంగా ఆస్ట్రేలియాలోని క్వీన్స్ లాండ్ రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి రోస్ బేట్స్ తో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమావేశమయ్యారు. సింగరేణిని అంతర్జాతీయంగా విస్తరించాలన్న ప్రభుత్వ ఆకాంక్షలకు ఇది తొలి అడుగుగా నిలిచింది. ఇటీవలనే తెలంగాణ పర్యటనకు విచ్చేసిన ఘనా దేశ ప్రతినిధి బృందం కూడా వారి దేశంలో కీలక ఖనిజ రంగంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా సింగరేణిని ఆహ్వానించడం విశేషం. సింగరేణి 136 ఏళ్ల చరిత్రలో మరో గొప్ప వ్యాపార విస్తరణకు నాంది పడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి



ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చొరవతో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోని విద్యుత్ సంస్థతో కలిసి సంయుక్త గా 2,300 మెగావాట్ల సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందడుగు వేసింది. రాజస్థాన్ లోని జైపూర్ లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాజస్థాన్ ఇంధన శాఖ మంత్రి హీరాలాల్ నగర్ సమక్షంలో సింగరేణి, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ అధికారులు ఈ మేరకు కీలక ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రాజెక్టులకు ఆ రాష్ట్ర కేబినెట్ ఆమోదం కూడా లభించింది. సింగరేణి ప్రాంతంలో బొగ్గు నిల్వలు తగ్గిపోతున్న నేపథ్యంలో కొత్త బ్లాక్లు చేపట్టడం అత్యవసరమైనందువల్ల కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బొగ్గు బ్లాక్ ల వేలం పాటలో పాల్గొనాలని చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం జరిగింది. మినీ చెరువుల ఏర్పాటుకు "నీటి బిందువు- జల సింధువు" కార్యక్రమం - 65 మినీ చెరువులను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న 45 చెరువులలో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించడమే కాకుండా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం జరిగింది. ఈ మినీ చెరువులన్నీ ఇప్పుడు పూర్తిగా నిండి జల కళ సంతరించుకున్నాయి. ఈ చెరువుల్లో 663 లక్షల గ్యాలన్ల వర్షపు నీరు వచ్చి చేరడం విశేషం.నైనీ కోల్ బ్లాక్ ప్రారంభం - డిప్యూటీ సీఎం వర్చువల్ ప్రారంభం. సింగరేణి పాఠశాలల్లో మొదటిసారిగా సీబీఎస్ఈ బోధనను ప్రారంభించడం జరిగింది. 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరాకై ఎన్టీపీఎస్-సెయిల్ పవర్ కంపెనీ లిమిటెడ్ తో ఒప్పందం,సింగరేణి ఉద్యోగులకి పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ లతో 1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా ఒప్పందం, 500 మెగావాట్ల ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ ప్లాంటుని మూసివేయబడ్డ మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని సంపు వద్ద నిర్మించుటకు శ్రీకారం, సింగరేణి సామాజిక బాధ్యతలో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి కల్పించుటకు తేనెటీగల పెంపకం కిట్ల పంపిణీ ప్రారంభం (కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో). తేనె తయారు చేసిన మహిళలు మరియు అమ్మకం దిశగా అడుగులురాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విజయవాడలోని సింగరేణి అనుబంధ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ %ు% ఇంజనీరింగ్ లిమిటెడ్ ని సందర్శించి సంస్థ అభివృద్ధికి దిశా నిర్దేశం చేశారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన కీలక ఖనిజాల వేలం పాటలో పాల్గొని 37.75 శాతం రాయల్టీతో కర్ణాటక లోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ ను దక్కించుకోవడం జరిగింది. సింగరేణిలోని 4 గనులకు 5 స్టార్ రేటింగ్ - జాతీయ స్థాయి గుర్తింపు,2024-25 లో సింగరేణి చరిత్రలో అత్యధిక లాభాలు (రూ. 6,394 కోట్లు) సాధించాం. అత్యధికంగా 34 శాతం లాభాల వాటా కింద 802 కోట్ల రూపాయలను కార్మికులకు చెల్లించడం జరిగింది. పొరుగు సేవల సిబ్బందికి రూ.5,500 చొప్పున లాభాల వాటా చెల్లించడం జరిగిందిఒక్కో కార్మికునికి 1.03 లక్షల దీపావళి బోనస్ ప్రకటన - రూ. 400 కోట్లు వెచ్చించనున్న సంస్థ - రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ప్రకటన సింగరేణి అంతర్జాతీయ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకారం అందిస్తూ ఆ దిశగా సింగరేణి గ్లోబల్ కార్యాలయం నిర్మాణం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీలో 10 ఎకరాలు కేటాయిస్తున్నట్లు చరిత్రాత్మక ప్రకటన చేశారు,ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ తో పునరుత్పాదక ఇంధన రంగంలో ప్లాంట్ల నిర్వహణకు ఒప్పందం,నీతి ఆయోగ్ క్రిటికల్ మినరల్ డెవలప్మెంట్ కమిటీలో సింగరేణికి స్థానం,బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ -సోలార్ పవర్ స్టోరేజ్ కి రాష్ట్రంలోనే మొట్ట మొదటి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టమ్ ని మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ వద్ద నిర్మాణానికి అవకాశం, సింగరేణి భవిష్యత్ విస్తరణ కోసం విజన్ -2030-2047 పేరిట స్వల్ప కాలిక, దీర్ఘకాలిక వ్యూహాలతో కూడిన విజన్ డాక్యుమెంట్ను విడుదల చేయడం జరిగింది, సింగరేణిలో కొత్తగా సత్తుపల్లి ఏరియా ప్రారంభం (రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా జీఎం ఆఫీస్ భవన సముదాయాన్ని ప్రారంభించారు) , కార్బన్ డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ ప్లాంట్ నిర్మాణం, సింగరేణి ఉద్యోగులకి మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులలో క్యాథ్ ల్యాబ్ ల ఏర్పాటు ,కొత్తగూడెం ఏరియా వెంకటేష్ ఖని ఉపరితల గని ప్రారంభం మరియు ఇల్లందు ఏరియా జవహర్ ఖని ఉపరితల గని కి అన్ని అనుమతులు లభ్యం (ప్రారంభానికి సిద్ధం) , ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గోదావరిఖని, మధిర, భూపాలపల్లి, వైరా, బెల్లంపల్లి, సత్తుపల్లి, హుజూర్ నగర్, కొత్తగూడెం ప్రాంతాల్లో జాబ్ మేళాలు నిర్వహించి 27 వేల మందికి ఉపాధి కల్పించడం జరిగింది. ఇల్లందు ఏరియాలో 150 కెవి రూఫ్ టాప్ సోలార్ ప్రారంభం, సింగరేణిలో మహిళా ఉద్యోగులకు ఆపరేటర్లుగా ఉపరితల గనుల్లో అవకాశం, నిరుద్యోగ యువత కోసం సింగరేణి భూపాలపల్లి ఏరియాలో, రామగుండం-3 ఏరియాలోని సెంటినరీ కాలనీలో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ప్రారంభించారు. సింగరేణికి సంస్థకు స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 5.0 లో జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు, నాగపూర్ లో జరిగిన ఆల్ ఇండియా స్థాయి రెస్క్యూ కాంపిటీషన్స్ లో సింగరేణి విజయకేతనం, ఈ జాతీయస్థాయి రెస్క్యూ పోటీల్లో సింగరేణి పురుషుల విభాగంలో ఛాంపియన్ షిప్ తో పాటు మహిళల విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించింది ఇవి కాక వ్యక్తిగతంగా 20 బహుమతులను సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. త్వరలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి రెస్క్యూ పోటీలలో సింగరేణి జట్లు పాల్గొనబోతున్నాయి.

## ఉద్యోగ విరమణ పొందిన జి.ఎం కు ఆత్మీయ సన్మానం

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ జి.ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉద్యోగ విరమణ పొందిన రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు, సేవా అధ్యక్షురాలు శ్రీమతి అలివేణి సుధాకర రావు లను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఏరియాలోని వివిధ గనులు, విభాగాధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏ.పి.ఏ జిఎం కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర సుధాకరరావు సింగరేణి సంస్థలో 40 సంవత్సరాల 2 నెలల పాటు వివిధ ఏరియాలలో, వివిధ గనులు, విభాగాలలో, వివిధ హోదాలలో విధేయతతో, అంకితభావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు.పలు సంస్కరణలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. రామగుండం-3 ఏరియా జీవిత కాలం పెరగడానికి వారు చేసిన కృషి ఎనలేదని, ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన ఆర్జీ-3 జిఎం నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ ఏరియాలో జిఎం కార్యాలయం ఎంతో కీలకమని, ఇక్కడ తీసుకునే నిర్ణయాల వలన గనుల్లో పనులు త్వరితగతిన పూర్తవుతాయని, మీ అందరి సహకారంతో రెండున్నర సంవత్సరాలు ఏరియా లో జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహించానని, అందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఎస్వోటు జిఎంలు యం. రామ్మోహన్, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జంగేటి రాజశేఖర్, విభాగాధిపతులు బి.సుదర్శనం, రాజేంద్ర కుమార్, మురళి కృష్ణ, రాజారెడ్డి, జనార్ధనరెడ్డి , సి.జె.సురేఖ, రాజేశ్వరి, ఐలయ్య, రవి చరణ్, షబ్బీరుద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**సూర్య, సెంటినరీ కాలనీ**



గోదావరిఖని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయంలో భవన నిర్మాణం కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను గోదావరిఖని,అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మెరుగు శ్రీకాంత్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లేబర్ ఆఫీసర్ మెరుగు శ్రీకాంత్ మాట్లాడుతూ ...కార్మికుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె షరీఫ్, బైరి శంకర్, కుక్క మల్లేష్, గాదె సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 27సార్లు రక్తదానం చేసి

## యువతకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్న విద్యాసాగర్.

**సూర్య జూలపల్లి**



జూలపల్లి మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు గంగిపల్లి విద్యాసాగర్ ఆపదలో ఉన్న మహిళకు రక్తదానం చేసి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన శకుంతల అనే మహిళ గుండె సంబంధిత వ్యాధితో కరీంనగరంలోని ఓ ఆసుపత్రిలో అత్యవసరంగా రక్తం ఎక్కించాలని విషయం తెలుసుకున్న విద్యాసాగర్వెంటనే వెళ్లి 27వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి మన్ననను పొందుతున్నారు.నేటి యువతరం అంత డిసెంబర్ 31 వేడుకల్లో నిమగ్నమైన వేళ సమాజానికి ఉపయోగపడాలని ఉద్దేశంతో ఆపదలో ఉన్న మహిళకు రక్తదానం చేసిన సందర్భంగా ఆయనను మండల ప్రజలు అభినందిస్తున్నారు.

# గంజాయి సరఫరా, అమ్మకానికి పాల్పడిన

## నిందితులకు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.15,000 జరిమానా.

## కీలక తీర్పును వెలువరించిన ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎస్.నారాయణ.

**సూర్య జగిత్యాల :**

గంజాయి సరఫరా అమ్మకానికి పాల్గొన్న ముగురు నిందితులకు జగిత్యాల జిల్లా మొదటి సెషన్స్ జడ్జి నారాయణ 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.15,000/- జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనిమారంపల్లి లక్ష్మణ్ (23), దొమ్మటి కార్తిక్(24),మల్యాల అజయ్(24), 2024 ఏప్రిల్ 16న బజాజ్ పల్సర్ బైక్ పై నిషేధిత గంజాయిని సరఫరా చేయడానికి వస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్.ఐ సతీష్ తన సిబ్బందితో కలిసి చిల్వకోడూర్ టి జంక్షన్ తనిఖీలు నిర్వహిస్తుండగా సాయంత్రం 6:00 గంటల సమయంలో, పల్సర్ బైక్పై ఇద్దరు వ్యక్తులు ఒక నల్లటి బ్యాగ్తో రావడాన్ని గమనించి వారిని ఆపే ప్రయత్నం చేయగా, వారు తప్పించుకునేందుకు యత్నించారు. పోలీసుల చాకచక్యంతో వారిని పట్టుకోవడం జరిగింది. వారి వద్ద ఉన్న నల్లటి బ్యాగ్ను పంచ్ ల సమక్షంలో తెరిచి పరిశీలించగా, నాలుగు గోధుమ రంగు ప్లాస్టిక్ ప్యాకెట్లు, ఒక తెల్లటి ప్లాస్టిక్ కవర్లో గంజాయి ఉన్నట్లు గుర్తించడం జరిగింది. మొత్తం గంజాయి బరువు 13.282 కిలోలు, దీని విలువ సుమారు రూ.2,65,640/- రూపాయలుగా తేలిందని ఎస్పీ వెల్లడించారు. కేసు విచారణలో సేకరించిన ఆధారాలు, నిందితుల ఒప్పుకోలు, సాక్ష్యాలు ఆధారంగా, న్యాయమూర్తి నారాయణ నిందితులకు 7 సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కరికీ రూ.15,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పై కేసు లో నిందితుల చర్యలు చట్టవిరుద్ధమైనవే కాకుండా, సమాజానికి హానికరమైనవిగా పరిగణించబడిందని, గంజాయి వంటి మత్తు పదార్థాల పెంపకం, సరఫరా, విక్రయం వంటి అక్రమ కార్యకలాపాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ,ఇలాంటి నేరాలకు పాల్పడిన వారెవ్వరూ శిక్ష తప్పించుకోలేరని తెలిపారు. యువత చెడు అల్లవాట్లకు , ఇటువంటి అక్రమ వ్యాపారాలకు దూరంగా ఉండి, చట్టాన్ని గౌరవించి సమాజ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ఇన్స్పెక్టర్ రామ్ నర్సింహారెడ్డి, ఎస్.ఐ సతీష్ ,పి.పి. కే. మల్లేశం గౌడ్ , సి ఎం ఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ శ్రీధర్ , సి ఎం ఎస్ కానిస్టేబుల్ రాజు నాయక్,కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# 'ఖని' కృష్ణవేణి పాఠశాల లో మోటివేషన్ ప్రోగ్రాం

## - కుటుంబం, సమాజం, దేశం కోసం నిలబడే పౌరులుగా ఎదగాలి - త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

**సూర్య-గోదావరిఖని**



త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళాశాసనములతో దేవనాథ రామానుజ జీయర్ స్వామి దివ్య అనుగ్రహంతో, ఎన్.సి.ఆర్.టి, రాష్ట్రస్థాయి నిపుణుల ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడి కృష్ణవేణి స్కూల్స్ కు చెందిన మార్కండేయ కాలనీ కృష్ణవేణి పాఠశాలలో 8, 9,10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ మనకు ఏమి తెలియడం వలన లాభం జరుగుతుంది అనే విషయాలపై విద్యార్థులు దృష్టి సారించాలని, విలువలు, క్రమశిక్షణ కలిగిన విద్య రేపటి బంగారు భవిష్యత్తుకు పునాది అవుతుంది అని చెప్పుకొచ్చారు. సమాజం ద్వారా గౌరవించబడే విధంగా ప్రతి ఒక్కరు ఎదగాలని, కేవలం బతకడం కోసమే డబ్బు అనే విషయాన్ని గుర్తు పెట్టుకొని, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు విద్యార్థులు ఇప్పటినుండే కృషి చేయాలని సూచించారు. కుటుంబం, సమాజం, దేశం కోసం చురుగ్గా నిలబడే పౌరులుగా కృష్ణవేణి స్కూల్స్ విద్యార్థులు తయారు కావాలని ఆయన వైష్ణవ సంప్రదాయంలో మంగళ శాసనం చేశారు. కృష్ణవేణి స్కూల్స్ డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పాఠ్యాంశాలునేర్చుకోవాలనే ఆసక్తిని, లక్ష్యాలను సాధించాలనే పట్టుదలను పెంచేందుకు మోటివేషన్ ప్రోగ్రామ్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల వ్యక్తిగత ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి, వారికి స్ఫూర్తినిచ్చేలా బోధనా పద్ధతులను, సానుకూల వాతావరణాన్ని కల్పించి, లక్ష్యాలను నిర్దేశించి, ప్రోత్సహించడం ద్వారా వారిలో అంతర్గత ప్రేరణను పెంపొందించడం జరుగుతుందని వివరించారు. ఇది వారికి విజయానికి దోహదపడుతుందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు తో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరు చేయండి.

**సూర్య ,రాయికల్**



రాయికల్ మండలంలోని మహితాపూర్ గ్రామంలో బుధవారం రోజున 15 వ సామజిక తనిఖీ ఉపాధి హామీ గ్రామ సభ స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసి గ్రామంలో గతం లో జరిగిన పనులను చదివి 470 ఉపాధి హామీ కూలీల జాబు కార్డు కలిగి ఉండి ఇందులో నుండి 260 మంది పని చేసి వారికి 23 లక్షలు పై చిలుకు వారి ఖాతాలో పని చేసిన వేతనం జమ చేయటం జరిగిందని, మెటీరియల్ రూపకం లో ఒక లక్ష 16 వేల రూపాయలు జరిగింది అని DRP రమ్య గాతెలిపారు. ఇట్టి గ్రామ సభలో గ్రామానికి సంబదించిన పలు సమస్యల పై నూతనంగా దరఖాస్తు పెట్టుకున్న వారి అందరికి ఉపాధి హామీ కార్డులు ఇవ్వాలని గ్రామం లో మెయిన్ రోడ్లకు ఇరువైపులా రోడ్లకు మీదికి వచ్చిన పెరిగిన పిచ్చి మొక్కలను ఉపాధి హామీ కూలీల తోని తొలగించాలని,గ్రామంలోని నూతనంగా నిర్మించుకున్నటువంటి టాయిలెట్ ఇది వరకు నిర్మించినటువంటి నిధులను వెంటనే మంజూరు చేయాలని,పోరుమళ్ళ నుండి మహితాపూర్ మీదిగా రాయికల్ నకు పోవు పెద్ద వాగులో పూర్తిగా మట్టితో నిండి పోయి వాగు మొత్తం పాల సముద్రం తో ఇతర మొక్కలతో నిండిపోయిందని,వాగులోని నీరు రాక ఇబ్బంది పడుతున్నారని,వాటిని వెంటనే కూలీల తో తొలిగించినట్లు అయితే రైతులకు గ్రామం లోని మంచి తాగు నీటి బావులకు ఎంతో ప్రయోజనకరంగ ఉంటుందని అన్నారు. గ్రామంలో ఎస్సారెస్పి కెనాల్ లో శుభ్రం చేయించాలని,గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విధార్థులు చదువు కొనుట కొరకు గదులు సరిపోవుట లేనందున రెండు అదనపు గదులు ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేయాలనీ అలాగే ప్రైమరీ స్కూల్ వద్ద ప్రహరీ గోడ, టాయిలెట్స్ మంజూరు చేయలని సర్పంచు తలారి నాగమణి రాజేష్, ఉప సర్పంచ్ దొంగ ప్రణయ్,వార్డ్ సభ్యులు అనుమల్ల రమ,కొల్లా ప్రమీల,నేమిళ్ల లత బొమ్మేనా లక్ష్మి,బుస గంగ మల్లయ్య,లింగంపెల్లి లక్ష్మణ్, సద్ది సంగీత,బత్తిని శ్రీనివాస్,భూపెల్లి పరమేష్ లతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, అనుమల్ల సత్యనారాయణ, కొల్లా నారాయణ, స్వామిరెడ్డి, వేణు, సాయి, లక్ష్మణ్ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ వినరాణి, పంచాయతీ కార్యదర్శి తోగిటి వేణు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ మేట్ బొమ్మేన తేజ, కవిత ఉపాధి హామీ కూలీలు గ్రామస్తులు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు బెంచిలు అందజేత...

**సూర్య - పెద్దపల్లి రూరల్**

మండలంలోని నిమ్మనపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కూర్చోవడానికి బెంచెస్ లేక ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు దాస్ సేవ సమితికి కోరగా స్పందించిన దాస్ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ డిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి స్కూల్స్ సిఈవో మల్కా యశస్వి సహకారం తో ఒక లక్ష 30 వేల రూపాయల విలువ గల 25 బెంచీలను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ సర్పంచ్ వేల్పుల రమేష్, గ్రామస్తులు మరియు దాస్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు .



## CEIR పోర్టల్ ద్వారా

# మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత

### ఏడాదిలో 2,056 ఫోన్ల రికవరీ

### - కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**




కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను CEIRపోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేస్తున్నట్లు కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన కార్యక్రమంలో రూ.18.20 లక్షల విలువైన 91 మొబైల్ ఫోన్లను బాధితులకు సీపీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్ల రికవరీలో విశేషంగా కృషి చేసిన రూరల్ టెక్నికల్ టీమ్ కానిస్టేబుళ్లు విశ్వతేజ, రాంసాయి, కీర్తనలను సీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేస్తామని తెలిపారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 29 వరకు మొత్తం 6,700 ఫిర్యాదులు నమోదు కాగా, 3,939 ఫోన్లు గుర్తించగా, వాటిలో 2,056 ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. మానకొండూర్, కరీంనగర్ రూరల్, చొప్పదండి, ఇల్లందకుంట స్టేషన్లు అత్యుత్తమ రికవరీ ఫలితాలు సాధించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు నరేష్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిస్సహాయ వృద్ధులకు ఆర్థిక సహాయం

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ ప్రాంతానికి చెందిన నిస్సహాయ కుటుంబమైన గాండ్ల రాజం-మల్లమ్మ దంపతులకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డా.సురభి శ్రీధర్ చేతుల మీదుగా అందించడం జరిగింది. అనంతరం సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. సంస్థ కార్పొరేషన్ 56 డివిజన్ ఆర్గనైజర్ గడవేన సదానందం సతీమణి గడవేన సునీత జన్మదినం పురస్కరించుకొని కమాన్ పూర్ ప్రాంతానికి చెందిన గాండ్ల రాజం-మల్లమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ తమ పెళ్లిరోజు పుట్టినరోజుల సందర్భంగా నిస్సహాయులకు, నిర్భాగ్యులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. అనంతరం నూతనంగా కమాన్ పూర్ సర్పంచ్ గా ఎన్నికైన రంగు సత్యనారాయణ గౌడ్ కు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ ఆర్గనైజర్ గడవేన సదానందం-సునీత, పెద్దపల్లి జిల్లా సంస్థ మహిళా విభాగం అధ్యక్షురాలు భూపెల్లి జ్యోతి, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం కమాన్ పూర్ గౌరవ అధ్యక్షులు భూపెల్లి. మల్లేష్, ఆది వరాహ స్వామి ఆలయ మాజీ డైరెక్టర్ బొజ్జ నరసింహ చారి, మెడిటేషన్ నిర్వాహకులు తాళ్ళ శంకర్, జక్కుల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మరణ ధృవీకరణ పత్రం అందజేసిన సర్పంచ్ సతీష్.

**సూర్య ఓదెల**

ఓదెల మండల కేంద్రంలో ఇటీవలి మృతిచెందిన ముద్దసాని రాజయ్య , చెట్ల ఆలోజి తల్లి సాయమ్మ, రామినేని రాయమల్లమ్మ మృతుల కుటుంబ సభ్యులకు స్వయంగా వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు మరణ ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలు సర్పంచ్ కు పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ చనిపోయిన కుటుంబాలు గ్రామ పంచాయతీ చుట్టూ తిరగకుండా మా ఇంటికే వచ్చి ఇవ్వడం చాలా మంచి విషయమని గతంలో కొన్ని కుటుంబాలు డెత్ సర్టిఫికెట్ తీసుకోక సర్టిఫికెట్ అవసరం ఉన్నపుడు గ్రామపంచాయతీ వద్దకు వెళ్తే గడవుతీరాక ఇప్పుడు తమ పరిధిలో లేదని మళ్ళీ నోటరీ ద్వార అప్లై చేసి RDO నుండి తీసుకున్నామని ఇప్పుడు ఒక్క రూపాయి ఖర్చులేకుండా సర్పంచ్ గారే స్వయంగా వచ్చి ఇవ్వడం సంతోషమని అన్నారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు చింతం తిరుపతి, అప్పని తిరుపతి, రాపెల్లి రాజయ్య , గోపతి ప్రవీణ్ ,ముద్దసాని కుమార స్వామి,క్రాంతి,చేరాలు, బోడకుంట బాలరాజు, పోలోజు రమేష్,కుమార్ మృతుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

## - కరీంనగర్ సీపీ గౌష్ ఆలం - యువత లక్ష్యం దిశగా సాగాలి, వ్యసనాలకు బానిస కావద్దు
## - ఆరోగ్యం కోల్పోతే అన్నీ కోల్పోయినట్లే - సోషల్ మీడియా వాడకంపై అప్రమత్తంగా ఉండాలి
## - ఎస్.ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**సూర్య, తిమ్మాపూర్**

మత్తు పదార్థాల వ్యసనంతో బంగారు భవిష్యత్తు ఉన్న యువత తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం అలుగునూరులోని ఎస్.ఆర్ విద్యాసంస్థల ఆవరణలో ఎస్.ఆర్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "మత్తు పదార్థాలు - యువతపై దుష్ప్రభావాలు" అనే అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీపీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు:

**- చెడు సావాసాలకు దూరంగా ఉండాలి:**

16 నుండి 20 ఏళ్ల వయసు విద్యార్థి దశలో అత్యంత కీలకమని, ఈ సమయంలోనే



చాలామంది చెడు సావాసాల వల్ల పెడదారి పడుతున్నారని సీపీ పేర్కొన్నారు. తొలుత సరదాగా మొదలై, ఆపై వ్యసనంగా మారే క్రమంలో స్నేహితుల పాత్ర ఎక్కువగా ఉంటుందని, అలాంటి వారిని గుర్తించి వెంటనే దూరం పెట్టాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

**- ఒత్తిడికి లోనైతే ఆటలు, సంగీతం వైపు మళ్లండి**

చదువుల ఒత్తిడి సహజమని, దాని నుండి ఉపశమనం పొందేందుకు మత్తు పదార్థాలను ఆశ్రయించవద్దని ఆయన కోరారు. ఒత్తిడి అనిపిస్తే క్రీడలు, సంగీతం వంటి సృజనాత్మక రంగాల వైపు దృష్టి సారించాలని, శారీరక దృఢత్వం కోసం ఆటలు ఆడాలని సూచించారు.

**- సోషల్ మీడియా - కొత్త వ్యసనం:**

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా కూడా ఒక ప్రమాదకరమైన వ్యసనంగా మారుతోందని సీపీ హెచ్చరించారు. "మీరు రోజుకు అరగంట కంటే ఎక్కువ సమయం రీల్స్ చూస్తున్నారంటే, మీరు దానికి బానిసైనట్లే" అని స్పష్టం చేశారు. అలాగే సినిమాల్లో విలన్లను హీరోలుగా చూపే పాత్రలను



ఆదర్శంగా తీసుకోవద్దని, అవి యువతను తప్పుదోవ పట్టిస్తాయని హితవు పలికారు.

**- తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయవద్దు**

ఎస్సార్ కాలేజీ జోనల్ ఇన్చార్జ్ తిరుపతి మాట్లాడుతూ, లక్ష్యం కోసం శ్రమించే విద్యార్థులకు వ్యసనాలు స్పీడ్ బ్రేకర్ల వంటివని అన్నారు. క్రమశిక్షణతో ఉంటేనే తల్లిదండ్రుల కలలను నిజం చేయగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎస్సై శ్రీకాంత్, ఎస్సార్ కాలేజీ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

# అర్హులకు సదరం సర్టిఫికెట్ అందించాలి

## - సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్
## - వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం

**సూర్య, కరీంనగర్ ప్రతినిధి**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రమం తప్పకుండా సదరం శిబిరాలు నిర్వహించాలని, అర్హులకు సదరం సర్టిఫికెట్లు అందించాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆదేశించారు. సదరం శిబిరాల నిర్వహణ, యూడీఐడీ తదితర అంశాలపై అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓలు, అధికారులతో సెర్ప్ సీఈవో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా సదరం శిబిరాల నిర్వహణ, పెండింగ్ అప్లికేషన్ల వివరాల పై ఆరా తీశారు. సెర్ప్ సీఈవో మాట్లాడారు. సదరం శిబిరాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, దరఖాస్తుదారులకు సమాచారం చేరవేయాలని, వారు



అబ్సెంట్ కాకుండా చూసుకోవాలని సూచించారు. వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. భవనాలు, ఫర్నిచర్, ఇతర సౌకర్యాల కోసం నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం అవసరమైన వైద్యులను నియమించు కోవాలని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి వెంటవెంటనే నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. యూడీఐడీ కార్డుల జారీ, ఇతర అంశాలపై వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, పీడీ డీఆర్డీఏ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ గురుకుల ఉపాధ్యాయుల హక్కులను కాపాడండి

## - కేంద్ర హోం శాఖా సహాయ మంత్రికి వినతిపత్రం

**సూర్య, కరీంనగర్**

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరింపజేయాలని, ముఖ్యమంత్రి, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యాపకుల సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారిక ఆధ్వర్యంలో రాజన్న జోన్ ప్రతినిధులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలల సమయసారిని ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ పాఠశాలల సమయసారినికి భిన్నంగా ఉందని అన్నారు. గురుకులాల్లో నైట్ స్టడీ, నైట్ స్టేలతో



ఉపాధ్యాయులు అనేక మానసిక ఒత్తిళ్ళకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కనీసం మనుషుల్లా భావించాలని, మానవ హక్కులను ఉల్లంఘించే విధంగా విద్యేతర విధులను బలవంతంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, ఇకనైనా మా సమస్యలను పరిష్కరించి రాత్రి విధుల నుండి తప్పించి NCTE సూచించిన విద్యా ప్రమాణాల మేరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు టైం టేబుల్ మార్చాలని, ఎఫ్ ఆర్ ఎస్ విధానాలకు తాము వ్యతిరేకం కాదని అయితే సమయం సరిపోక పోవడంతో వ్యతిరేకిస్తున్నామని, క్లాసులో 40 మంది విద్యార్థులను ఎఫ్ఆర్ఎస్ తో పాటు ఉపాధ్యాయులు ఎఫ్ ఆర్ ఎస్ వల్ల ఒక పిరియడ్ వృధాగా పోతుందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ఓపికతో విన్న బండి సంజయ్ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఏనుగుల సంతోష్, బాసర జోన్ మహిళా విభాగం అధ్యక్షులు రాధ, రాజన్న జోన్ అధ్యక్షులు పొన్నం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, రాష్ట్ర సహ కారదర్శి కె.విశాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**సూర్య, కరీంనగర్**



ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలందరూ అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను పొందుతున్న క్రమంలో రాబోయే రోజుల్లో మరింత నూతన ఉత్సాహంతో ముందుకు సాగుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరుకుంటు న్నానని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## మరమ్మత్తు పనులు ప్రారంభం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలో మామిండ్ల వాడలోని ఎల్ఐసి కార్యాలయం ముందు మిషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మత్తులు అధికారులు ప్రారంభించారు. ఎల్ఐసి కార్యాలయం ముందు రెండు చోట్ల భగీరథ పైపుల నుండి నీరు లీకేజీ అవుతూ రోడ్డుపై బురదగా ఉండడం, అటువైపు నుండి వెళ్తున్న వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడేవారు. ప్రజల ఇబ్బందిని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు మరమ్మత్తు పనులు ప్రారంభించారు.

## దుర్గమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

**సూర్య, తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలోని దుర్గమ్మ గుడి నిర్మాణ పనులకు జరిగిన భూమి పూజ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నుస్తులాపూర్ సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య-శ్రీనివాసరావు, వార్డు మెంబర్ ఎస్.కొండల్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీగిరి రంగారావు, పార్టీ నాయకులు కొత్త తిరుపతిరెడ్డి, మామిడి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం ఎలబాక - గంగారం గ్రామంలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎలబాక - గంగారం గ్రామ అధ్యక్షులు పిల్లి రవి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పకుండా వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమునకు ముఖ్య అతిథిగా ఎలబాక గ్రామ సర్పంచ్ నల్లగోని సరోజన - రాజారాం, గంగారం సర్పంచ్ తనకు సంధ్య - సందీప్, ఉప సర్పంచ్ కోట శ్రీనివాస్ రెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు మేర్గవేణి రాజయ్య యాదవ్, కార్యదర్శి రవి యాదవ్, డైరెక్టర్ పిల్లి కుమార్ యాదవ్, మాజీ అధ్యక్షులు మేర్గవేణి ఓదెలు యాదవ్, పిల్లి గట్టయ్య, సంపత్, మల్లేష్, మామిడాల పల్లి పశు వైద్యాధికారులు డాక్టర్ అభిలాష్ రెడ్డి, ఎలబాక వివిఎల్ఓ భాగ్యలక్ష్మి, కోర్కల్ జేవిఓ స్వప్న, సిబ్బంది శ్రీకాంత్, గోపాలమిత్రులు కొల్లూరి బాబురావు, గుర్రాల రాజేందర్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో విద్యార్థులు,యువత ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలి

**- అనుమల్ల చంద్రమౌళి కొత్త పల్లి ఉప సర్పంచ్**

**సూర్య,కొత్త పల్లి**

విద్యార్థులు, యువత నూతన సంవత్సరంలో ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలని కొత్త పల్లి మాజీ ఉప సర్పంచ్, సామాజిక సేవకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం యువత సామాజిక సేవలో నిరంతరం భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్..బిజేపీ ప్రజలకు దూరమయ్యాయి

**- అసెంబ్లీకి రావడానికి కూడా కేసీఆర్కు నామోషీ - మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్దే విజయం**

**- కొండగట్టు ఆలయానికి బీఆర్ఎస్ హయాంలో నిధులే లేవు - చొప్పదండి నియోజకవర్గం ఎడ్యుకేషన్, ఇరిగేషన్ హబ్గా అభివృద్ధి**

**- కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అధికారాన్ని కోల్పోయి ప్రజలకు పూర్తిగా దూరమయ్యాయని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. డీసీసీ కార్యాలయంలో బుధవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యులు అంజన్ కుమార్ తో పాటు పలువురు నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో కూర్చోవడానికి కూడా కేసీఆర్ నామోషీగా భావిస్తున్నారని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు శాసనసభకు రావడం కూడా ఇష్టపడడం లేదని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ,




పెంచిన రైతు భరోసా, అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్ల నిర్మాణం జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి గృహప్రవేశాలు కూడా పూర్తి చేసిందని వివరించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి 60 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న పభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, తెలంగాణలో మెజారిటీ మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని తెలిపారు. కొండగట్టు ఆలయ అభివృద్ధిపై మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదని అన్నారు. పవన్ కళ్యాణ్ సహకారంతో ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గాన్ని రానున్న రోజుల్లో ఎడ్యుకేషన్ హబ్గా, ఇరిగేషన్ హబ్గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సుధా చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హనీ ట్రాప్ ముఠా గుట్టురట్టు..

**- మెట్పల్లిలో బయటపడ్డ భారీ 'హనీ ట్రాప్' - రౌడీ షీటర్ నేతృత్వంలో దందా....**

**- ఉచ్చులో పడితే నగ్న వీడియోలు తీసి బ్లాక్ మెయిల్... - ముగ్గురు నిందితుల అరెస్ట్, ముగ్గురు పరారీ..**

**- రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. - రౌడీ షీటర్ సహా ముగ్గురు కటకటాల్లోకి.**

**సూర్య మెట్పల్లి:-**

అమాయక వ్యక్తులను ముఖ్యంగా ధనవంతులను టార్గెట్ చేస్తూ మహిళలతో వల వేసి, ఏకాంతంగా ఉన్న సమయంలో నగ్న వీడియోలు తీసి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న హనీ ట్రాప్ ముఠాను జగిత్యాల జిల్లా మెట్పల్లి పోలీసులు ఛేదించారు ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్న రౌడీ షీటర్ కోరుట్ల రాజుతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ అనిల్ కుమార్ బుధవారం సర్కిల్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. మెట్పల్లి దుబ్బవాడ (గోల్ హనుమాన్) కు చెందిన రౌడీ సీటర్ కోరుట్ల రాజ్కుమార్ అలియాస్ రాజు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో భర్తకు దూరంగా ఉంటున్న బలుమూరి స్వప్న అనే మహిళతో చేతులు కలిపాడు. వీరిద్దరితో పాటు ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన బట్టు రాజశేఖర్, మూలరాంపూర్ గ్రామానికి సుంకేటీ వినోద్, మెట్పల్లి పట్టణానికి చెందిన పులి అరుణ్, మాగని దేవా నర్సయ్యలు ఒక ముఠాగా ఏర్పడి పట్టణంలోని హనుమాన్ నగర్లో బచ్ పన్ స్కూల్ సమీపంలో ఒక గదిని అద్దెకు తీసుకొని




మహిళల పట్ల బలహీనత ఉన్న ధనవంతుల ఫోన్ నంబర్లు సేకరించేవారు. స్వప్న వారితో ఫోన్లో కవ్వించి మాట్లాడుతూ తన గదికి రప్పించేది. బాధితులు లోపలికి వెళ్లి నగ్నంగా ఉన్న సమయంలో, నిందితులు ఒక్కసారిగా గదిలోకి ప్రవేశించి సెల్ ఫోన్లలో వీడియోలు తీసేవారు. ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని బెదిరించి లక్షలాది రూపాయలు వసూలు చేసేవారని. ఇప్పటికే ఈ ముఠా పలువురిని బ్లాక్ మెయిల్ చేసినట్లు విచారణలో తేలినట్లు తెలిపారు.

**తాజా ఘటన:**

మూడు నెలల క్రితం మెట్పల్లి (బండ లింగాపూర్) కు చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి పాశపు చిన్నారెడ్డి ని టార్గెట్ చేసిన ఈ ముఠా ఈ నెల 28న ప్లాన్ ప్రకారం గదికి పిలిపించి నగ్న వీడియోలు తీసింది. విషయం బయటకు రాకుండా ఉండాల ంటే 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. బాధితుడు ధైర్యంతో పోలీసులను ఆశ్రయించడంతో ఈ ముఠా గుట్టు రట్టయింది. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కోరుట్ల రాజ్ కుమార్ (రౌడీ షీటర్), మాగని దేవా నర్సయ్య, బలుమూరి స్వప్న లను అరెస్టు చేసి విచారణ అనంతరం కోర్టులో హాజ రు పరిచి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ముఠాకు చెందిన బట్టు రాజశేఖర్ (ఎర్దండి), సుంకిటి వినోద్ (ములరంపూర్),పులి అరుణ్ (మెట్పల్లి) (రౌడీ షీటర్) లు పరారీలో ఉన్నారని వారిని కూడా అరెస్టు చేస్తామని సోషల్ మీడియా లేదా అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా ఇటువంటి వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సీఐ కోరారు. నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న ఫోన్ లలో నిందితులు బ్లాక్మెయిల్ చేసిన వారి వీడియోలు ఉన్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. ఈ ముఠా గుట్టు రట్టు చేసిన సి.ఐ, బృందాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. సీఐ వెంట ఎస్సై కిరణ్ కుమార్ ఉన్నారు.

## సూర్య దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**సూర్య జగిత్యాల:**

సూర్య దినపత్రిక ఇయర్ ప్లానర్ క్యాలెండర్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆవిష్కరించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పి క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్యాలెండర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వార్షిక ప్రణాళిక తయారు చేసుకునే విధంగా దీనిని రూపొందించడం అభినందనీయమన్నారు. సూర్య దినపత్రికలో వచ్చే విశ్లేషణాత్మక కథనాలను తాను రోజు పరిశీలిస్తానని ఎస్పీ తెలిపారు.






## ఆరు తడులకు మూడు నెలలు నీరు రోజూ 500 క్యూసెక్కులు

**- నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**సూర్య తిమ్మాపూర్**

దిగువ మానేరు డ్యామ్ నుండి కాకతీయ కాలవకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నీరు విడుదల చేశారు. బుధవారం ఎల్ఎండీ హెడ్ రెగ్యులేటర్ వద్ద సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎస్సారెస్పీ అధికారులతో కలిసి ఆయన స్విచ్ఛాన్ చేసి నీటి కాలువలోకి విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ లోయర్ మానేరు డ్యామ్ కింద గల సాగులో ఉన్న ఆయకట్టు రబీ(యాసంగి) పంటలకు సాగునీరందించాలనే ఉద్దేశంతోనే కాకతీయ కాలువకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. 3,04,875 ఎకరాల్లో ఐడీ పంటలు,3,85,820 ఎకరాల్లో తడి పంటలు వెరసి 6,90,695 ఎకరాల ఆయకట్టుకు 45.175 టీఎంసీల నీటి అవసరమని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. అందులో భాగంగానే ఇవాళ్టి నుంచి మార్చి మాసాంతం వరకు ప్రతి రోజు 500 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తామన్నారు. ఎల్ఎండీ నుంచి విడుదల చేస్తున్న నీరు మూడు జోన్లలో పరిధిలోని ఆయకట్టుకు సాగునీరందుతుందన్నారు. 1వ జోన్ పరిధిలో కరీనగర్ నుంచి మానకొండూర్, హుజూరాబాద్, పరకాల, భూపాలపల్లి, నర్సంపేట, డోర్నకల్, మహబూబాబాద్, వర్ధన్నపేట మండల్లోని 3,51,541 ఎకరాలకు, 2వ జోన్ పరిధిలో వర్ధన్నపేట నుంచి పాలకుర్తి, డోర్నకల్, పాలేరు, మధిర, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ మండలాల్లో 3,39,154 ఎకరాలకు నీరందుతుందని ఎమ్మెల్యే వివరించారు. సమానంగా నీటి పంపిణీ కోసం ఆన్ , ఆఫ్ విధానం ద్వారా ఆరు తడులకు 90 రోజులపాటు నీరందిస్తామని ఆయన చెప్పారు. కాకతీయ కాలువ ఆయకట్టు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ పర్యవేక్షక ఇంజినీర్ పి.రమేశ్, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఈ.సదయ్య, సంజన, కిరణ్ కుమార్, డీఈ డి.శ్రీనివాస్, ఏఈలు వంశీధర్, వెంకటేశ్, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మోరపల్లి రమణారెడ్డి,గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, కొత్త తిరుపతిరెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, సమద్, నాగిశెట్టి రాజయ్య, దూలం వీరస్వామి, వాల అంజుత్ రావు, ఎల్లారెడ్డి, బక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు నమోదు చేయాలి

**- ఎరువుల పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలి**

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- పెద్దూర్ పీఏసీఎస్, సిరిసిల్లలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్ లో తనిఖీ**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతుల పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్, పెద్దూర్ లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయా షాపుల్లో ప్రస్తుతం రిజిస్టర్, స్టాక్ ఎరువుల నిలువలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని బస్తాల ఎరువులు విక్రయించారో ఆరా తీశారు. ఇప్పటిదాకా విక్రయించిన ఎరువుల, రైతుల పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ షాప్ లు ఉదయమే తెరవాలని, సాగుకు అనుగుణంగా ఎరువుల పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి సంస్థ సంక్షేమానికి ఎల్లప్పుడూ పెద్దపీట

## - జీఎంలు నరేంద్ర, కొలిపాక

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థ సంక్షేమానికి ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని, సంక్షేమ కార్యక్రమాలకు ఎప్పుడు వెనుకాడదని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు అన్నారు. సెంటినరీ కాలనీ లోని జీఎం కార్యాలయ నందు సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మల్టీ పర్పస్ హాల్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ



సింగరేణి సంస్థ సంక్షేమానికి ఎప్పుడు వెనకాడదని, జీ.యం కార్యాలయానికి వివిధ పనుల పై వచ్చే ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు, సంస్థ పరంగా నిర్వహించే కార్యక్రమాల కోసం, జి.యం కార్యాలయ ఆవరణలో నిర్మించిన విశాలమైన మల్టీ పర్పస్ హాల్ ను అందరూ కూడా ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి సుధాకర రావు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటు జీఎంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఏరియా ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ అధికారి జె.రాజశేఖర్, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, విభాగాధిపతులు రాజా రెడ్డి, మురళి కృష్ణ, సుదర్శనం, జనార్ధనరెడ్డి, సురేఖ, ఐలయ్య, రాజేశ్వరి, లతో పాటు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# భూసమస్యలను పరిష్కరించాలని బండి సంజయ్ కి వినతి

**సూర్య, రామడుగు**

కరీంనగర్ పట్టణం చైతన్యపురి మహాశక్తి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ని బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాలారెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తి పట్టా భూములు రిజిస్ట్రేషన్ చేయాలని రేకుర్తి భూములను నిషేధిత 22 (ఏ) లో చేర్చడాన్ని వెంటనే తొలగించే విధంగా గ్రామ రైతులకు పట్టాదారులకు ప్లాట్ల యజమానులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. గత సంవత్సరం నుండి రైతులు భూములు కొనుగోలు చేసుకుని వ్యవసాయము చేసుకుంటూ నివసిస్తున్నారని తెలిపారు.కొనుగోలు చేసిన రైతులు అవసర నిమిత్తం ప్లాట్లుగా విభజించుకొని అమ్ముకున్నారు. ఇప్పుడు రేకుర్తి పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వెంటనే పట్టా భూములను రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు మాజీ కార్పొరేటర్ ఏదుల రాజశేఖర్ ఐక్యవేదిక కన్వీనర్ పాశం మోహన్ రెడ్డి బండ రమణ రెడ్డి అందె శ్యాంసుందర్ గోదరి నరేష్ రవీందర్ పచునూరి నరేందర్ ఆకుల క్రిష్ణ పిచర విష్ణు ప్రసాద్ రావు మధవ రావు తదితరులు పాల్గొన్నారు..

# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

## - శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పోలీసుల సదస్సు

**సూర్య, జగిత్యాల అర్బన్**




పట్టణంలోని బీట్ బజార్ ప్రాంతంలో ఉన్న శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ, రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా సీట్బెల్ట్, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ను గౌరవించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశం మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనంలోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అర్థం, వాటి ప్రాముఖ్యతను వివరించారు. రాబోయే రోజుల్లో సమాజానికి ఆదర్శంగా నిలిచేలా ప్రవర్తించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు ఫిరోజ్, జానకిరామ్తో పాటు పలువురు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ

**సూర్య, కొత్తపల్లి**



పశుసంవర్ధకశాఖ డాక్టర్ రామకృష్ణ విచ్చేసి ప్రారంభించారు. కొత్తపల్లి గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షులు. జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ నూతనంగా ఎన్నికైన ప్రమోటర్ లికురుమరత్న చిగుర్ల శ్రీనివాస్ కురుమలి అధ్యక్షతన గొర్రెలు మేకలకు నట్టల నివారణ ఇన్సులిన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు గొర్రెల కాపరులు తప్పనిసరిగా నట్టల నివారణమందు మరియు బ్లూటంగ్. కాలు కుంకుడు. ప్రభుత్వంచే పంపిణీ చేయబడుతున్నది మందులు టీకాలు సమయానికి అందించి గొర్రెల ఎదుగుదల మరియు గొర్రెల కాపరుల లాభాలు వచ్చే విధంగా ముందుకు వెళ్లాలి అని గొర్రెల పెంపకం దారులను కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టినటువంటి ఎన్ ఎల్ ఎం. స్కీంను ప్రతి ఒక్కరూ వీలైనటువంటివారు ఉపయోగించుకోవాలని ఇప్పుడున్న రోజులలో గొర్రెలు మేపడానికి గుట్టలు కనుమరుగు అయినాయి అదేవిధంగా చేన్లు. చెలుకలు లేవు.చెరువు కట్టమీద తుమ్మలులేవు. పాడి పశువులకు గడ్డి అనేది లేకుండా పోతున్నాయి కాబట్టి ఫామ్ ద్వారానే గొర్రెలు మేకలు అభివృద్ధి చేయాలని ఈ విధంగా చేయడం వలన గొర్రెల పెంపకం దారులు కు గాని గొర్రెలకు గాని చాలా వరకు లాభదాయకంగా ఉంటాయని తెలిపారు కేంచ రాజమల్లు మందలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఉపాధ్యక్షులు మేకల పోచమల్లు. ప్రధాన కార్యదర్శి పెద్ది సంతోష్. కోశాధికారి గుంటి రాజమల్లు. డైరెక్టర్లు పెద్ది విక్రం. కేంచ మల్లేశం. ఒగ్గరి జగన్. గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన జి.ఎం కు ఆత్మీయ సన్మానం

**సూర్య, సెంటినరీ కాలనీ**

అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉద్యోగ విరమణ పొందిన రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు, సేవా అధ్యక్షురాలు నరేంద్ర అలివేణి సుధాకర రావు లను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఇతర అధికారులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జి.యం ఏ.పి.ఏ మాట్లాడుతూ నరేంద్ర సుధాకరరావు సింగరేణి సంస్థలో 40 సంవత్సరాల పాటు వివిధ ఏరియాలలో, వివిధ గనులు, విభాగాలలో, వివిధ హోదాలలో విధేయతతో, అంకితభావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు.పలు సంస్కరణలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్వోటు జీఎం బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ రఘురామ్, మేనేజర్ పెంచలయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# కృష్ణవేణి విద్యా సంస్థలలో ముందస్తు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలం కలవచర్ల గ్రామంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, హిల్-పోర్ట్ హై స్కూల్, సాయి ప్రగతి విద్యానికేతన్ పాఠశాలల్లో ముందస్తుగా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ బర్ల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అందరూ సాంప్రదాయ దుస్తులలో వచ్చి తమ ఆట పాటలు మరియు నృత్యాల ద్వారా 2025 సంవత్సరంలో జరిగిన మధుర స్మృతులను తలచుకుంటూ, ఆ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ, 2026 నూతన ఆంగ్ల సంవత్సరమునకు స్వాగతం పలికారు.

# ఇటిక్యాల గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించిన మాజీ జడ్పీటీసీ

**సూర్య, రాయికల్**



గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రాయికల్ మండలం ఇటిక్యాల్ గ్రామంలో సర్పంచ్ గా గెలుపొందిన నీరటి శ్రీనివాస్,వార్డు సభ్యుడు కొక్కెర రాజు ని తాజా మాజీ జడ్పీటీసీ జాదవ్ అశ్విని స్వగృహం లో మర్యాదపూర్వకంగా కలవగా, వారికి సాలువతో సన్మానించి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆమె కోరారు

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా స్పందించాలి

## - గోదావరిఖని ఏసిపి మడత రమేష్

**సూర్య, సెంటినరీ కాలనీ**



ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా స్పందించాలని గోదావరిఖని ఏసిపి మడత రమేష్ అన్నారు. కమాన్పూర్ మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్ను బుధవారం గోదావరిఖని ఏసిపి మడత రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీనియర్ అధికారిగా ఏసిపి రమేష్ స్టేషన్ పనితీరును సమగ్రంగా పరిశీలిస్తూ, పోలీసు యంత్రాంగం ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీ సందర్భంగా స్టేషన్లోని రికార్డులు, కేసుల నమోదు విధానం, సిబ్బంది హాజరు వివరాలు, ఆయుధాగారం నిర్వహణ, సీసీటీవీ పర్యవేక్షణ, శుభ్రత ప్రమాణాలను ఏసిపి సవివరంగా పరిశీలించారు. ముఖ్యంగా పెండింగ్ కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకొని, విచారణల్లో వేగం పెంచాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా స్పందించాలన్న దిశగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, చట్ట పరిరక్షణ లో ఎలాంటి రాజీ పడకూడదని సిబ్బందికి హితవు పలికారు. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, నేర నియంత్రణకు గస్తీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సాంకేతిక వసతుల వినియోగాన్ని పెంచి, ఆధారాల సేకరణలో ఖచ్చితత్వం పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ ప్రసాద్ రావుతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయం వద్ద ముళ్ళ పొదలు, పిచ్చి మొక్కల తొలగింపు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం బేగంపేట గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను జేసిబి సహాయంతో తొలగించారు. గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, భక్తులు సులభంగా ఆలయానికి చేరుకునేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బేగంపేట గ్రామ సర్పంచ్ మంథెన చంటి, వార్డు మెంబర్ కొత్తూరు వాణి మోహన్ పాల్గొని పనులను పర్యవేక్షించారు. రహదారి శు భ్రతతో పాటు భద్రత కూడా మెరుగుపడుతుందని వారు తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ చర్యపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# జీవో 252తో జర్నలిస్టులకు నష్టం

## - జర్నలిస్టులలో తారతమ్యం చూడొద్దు - ప్రభుత్వ విప్‌కు టీయూడబ్ల్యూజే హెచ్ 143 వినతి



**సూర్య, వేములవాడ**

వేములవాడ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 252లో కొన్ని సవరణలు చేసే విధంగా చూడాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే హెచ్ 143) రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘం డిమాండ్ చేస్తుంది. బుధవారం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో కలిసి జీవోను సవరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తూ ప్రజా పాలన ప్రభుత్వం నూతన అక్రిడిటేషన్ల జారీ కోసం జీవో 252 తీసుకురావడం అభినందనీయమన్నారు. అయితే ఈ జీవోలోని కొన్ని నిబంధనలతో ఇప్పటి వరకు అక్రిడిటేషన్లు కలిగిన దాదాపు 10 వేల మందికి నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. డెస్క్ జర్నలిస్టులు, ఫీల్డ్ జర్నలిస్ట్ అన్న తేడా లేకుండా అందరికీ అక్రిడిటేషన్లు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టీయూడబ్ల్యూజే అభ్యర్థనపై రాష్ట్ర ప్రభుత్వ విప్ స్పందిస్తూ అయ్యండి పిఆర్ కమిషనర్ తో ఫోన్లో మాట్లాడారు. త్వరలోనే అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా టెంజు అధ్యక్షుడు ఇరుకుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులు సామల గట్టు, మహమ్మద్ అజీమ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీలు పాల్గొన్నారు.

# ఘనంగా టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు జన్మదిన వేడుకలు



**సూర్య, మెట్పల్లి**

టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు జన్మదినం వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా తయారుచేసిన కేక్ ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి ,ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సుజిత్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నారని గతంలో ఎన్నడు లేని విధంగా కోరుట్ల నియోజకవర్గంలో అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, ఎల్ఓసీ చెక్కులు అందించడానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబొద్దీన్ పాషా, మల్లాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, పాతధారాజ్ పల్లి ఉప సర్పంచ్ ఇప్పపల్లి గణేశ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోడిమ్యాల దీపక్ రాజ్, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, మామిడి రాజశేఖర్, ఎండి జాఫర్, మొగిలి రాజేందర్,బైండ్ల శ్రీకాంత్, కోరే రాజ్ కుమార్,అయ్యప్ప స్వాములు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వెల్జిపూర్ గ్రామ రైతులకు ఫర్టిలైజర్‌ను అందుబాటులోకి తెచ్చిన సర్పంచ్

**సూర్య, ఇల్లంతకుంట**



మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపెల్లి సత్యనారాయణ సహకారంతో సర్పంచ్ నాయిని నవీన్ కుమార్,పాలకవర్గం కృషితో వెల్జీపూర్ గ్రామం లోనే ఎరువుల పంపిణీకి నేటి నుండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం శ్రీకారం చుట్టింది. రైతులకు ఇల్లంతకుంట నుండి రవాణా భారం నుండి విముక్తి కలగనుంది. అంతే కాకుండా ఎరువుల కోసం పని వదులుకొని మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని, కేంద్రం ఏర్పడడంతో అందుబాటులో గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సహకరించిన ఇల్లంతకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ, మండల వ్యవసాయ అధికారి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండా వెంకటేశం, ఏఎంసీ చైర్మన్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గొల్లకోమటి శంకర్ గార్లకి మరియు యాదవ సంఘం సభ్యులకు గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి, వార్డు సభ్యులు గొల్ల కమిటీ మల్లవ్వ శంకర్, సోనవేణి (బొజ్జ) శ్రీనివాస్, సంగేపు వేణు, సంగెం ముత్తవ్వ, దేశెట్టి కవిత బాబుచందర్, వేములవాడ భారతి రాజేశం, బొల్లారం ప్రసన్నకుమార్‌లు పాల్గొన్నారు.

## నర్సక్కపేటలో బీహార్ కూలీలకు దుస్తులను ఎన్ హెచ్ఆర్సి ఇసి మెంబర్ అందజేత

**సూర్య, ఇల్లంతకుంట**



మండలంలోని నర్సక్క పేట గ్రామంలో కూలీచేస్తూ జీవిస్తున్న బీహారి రాష్ట్ర కూలీలకు, వారి పిల్లలకు నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఈసీ మెంబర్ అన్నాడి సత్యనారాయణ రెడ్డి దుస్తులను నూతన సంవత్సర కానుకగా బుధవారం అందజేశారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు దరఖాస్తుల గడువు తేదీ పొడగింపు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

2025-26వ విద్యా సంవత్సరమునకు గాను జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న ఎస్సి, ఎస్టీ, బిసి, ఓసి, మైనారిటీ విద్యార్థులు కాలేజీలలో అన్ లైన్ స్కాలర్ షిప్ ధరఖాస్తు చేసుకోవడానికి గడువు తేదీ 31 మార్చి 2026 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కే. రాజ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జగిత్యాల జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇప్పటి వరకు ధరఖాస్తు చేసుకోని విద్యార్థులకు తెలియజేసి జగిత్యాల జిల్లాలో ఆన్ లైన్ దరఖాస్తులను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 2024-25 వ విద్యా సంవత్సరములో కళాశాల స్థాయిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను ఆన్ లైన్ లో సంబంధిత డిస్ట్రిక్ట్ ఆఫీస్ కి ఫార్వార్డ్ చేయగలరని సూచించారు. బ్యాంకు అకౌంట్స్ కి ఆధార్ సీడింగ్ లేని విద్యార్థులతో ఆధార్ సీడింగ్ చేసుకోమని తెలియజేసి ఆధార్ సీడింగ్ చేసుకునేలా చూడాలన్నారు. దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు http://telanganaepass.cgg.gov.in లో అన్ లైన్ స్కాలర్ షిప్ లకై ధరఖాస్తులు చేసుకోగలరన్నారు. ఇట్టి సదావకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోగలరన్నారు.

## శుభప్రదమైన సమయంలో బాధ్యత స్వీకరించిన నూతన సర్పంచ్

**సూర్య,ముస్తాబాద్**



మంచి ముహూర్తం చూసి బాధ్యతలు స్వీకరించిన నూతన సర్పంచ్ మట్ట వెంకటేశ్వర రెడ్డి.గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ నిధుల వినియోగం వంటి ముఖ్య బాధ్యతలను శాస్త్రోక్తంగా, శుభప్రదమైన సమయంలో ప్రారంభించడం,గ్రామాన్ని ముందుకు నడిపించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు.గ్రామ సభలు నిర్వహించడం, పంచాయతీ పాలకవర్గానికి నాయకత్వం వహించడం,గ్రామ వనరులను నిర్వహించడం,ప్రజల సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు.

## వార్డు సభ్యులకు సగర సంఘం నాయకుల సన్మానం

**సూర్య, వీణవంక**



ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో వార్డు సభ్యులుగా గెలిచిన పలువురిని కరీంనగర్ జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని శ్రీరాములపేట గ్రామంలో కుర్మిండ్ల మల్లయ్య సగర, కొత్తపల్లిలో గుంటి తిరుపతి, వల్భాపూర్ గ్రామంలో నలుబాల రాజేష్ వార్డు సభ్యులుగా గెలుపొందారు. కాగా వీణవంకలో వారికి శాలువా కప్పి, పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట రాజు సగర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలుబాల బిక్షపతి సగర, జిల్లా మాజీ అధ్యక్షుడు ఏరుకొండ ప్రసాద్ సగర, వీణవంక మండల అధ్యక్షుడు గుంటి అశోక్ సగర, శ్రీరాములపేట, కొత్తపల్లి గ్రామ శాఖల అధ్యక్షులు దేవునూరి రాజేందర్ సగర, గుంటి రాజయ్య సగర, నాయకులు బొడిపెల్లి తిరుపతి సగర, నలుబాల మధు సగర తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప నామస్మరణతో పులకించిన భక్తులు

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని వీణవంక, నర్సింగాపూర్ గ్రామంలో అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు మాల వేసుకుని అత్యంత నియమనిష్టలతో, భక్తిశ్రద్ధలతో ప్రతినిత్యం అయ్యప్ప స్వామిని ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 రోజుల దీక్ష అనంతరం మాల విరమణ చేసేందుకు ఇరుముడిని వీణవంక మండలంలోని శివాలయం, నర్సింగాపూర్ గ్రామంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో గురు స్వాములు సూర్య ప్రకాష్, చంద్రమౌళి స్వాముల ఆధ్వర్యంలో ధరించి శబరిమల యాత్రకు అయ్యప్ప స్వాములు బయలుదేరారు. ఈ సందర్భంగా ఇరుముడి కట్టే సమయంలో భక్తులు అయ్యప్ప నామస్మరణతో మార్మోగగా కుటుంబ సభ్యులు వచ్చి ఇరుముడిలో బియ్యం పోస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో స్వాముల పాదాలకు వందనాలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. మాల విరమణ చేయడంతో పాటు శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా బయలుదేరి వెళ్లారు.

## నిర్లక్ష్యపు నీడలో... ఓపెన్ జిమ్...

**సూర్య, హుజురాబాద్**



రాజుల సొమ్ము రాళ్ళ పాలు...అన్న చందంగా తయారైంది హుజురాబాద్ పట్టణంలోని గణేష్ నగర్ లో గల ఓపెన్ జిమ్ పరిస్థితి. ప్రజల ఆరోగ్య అవసరాల కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయగా, ప్రస్తుతం దాని పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. జిమ్ అడుగు భాగంలో వేసిన షీట్స్ అన్ని పోయాయి. జిమ్ము ప్రాంతంలో ఆ పరిసర ప్రాంతంలోని ప్రజలు తమ మేకలను కట్టివేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని జిమ్మును కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## గ్రామపంచాయితీ పాలకవర్గాన్ని సన్మానించిన రాజేశ్వర్రావు

**సూర్య, కాల్వ శ్రీరాంపూర్**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన ఏరబాటి రాజేశ్వర్రావు ఆధ్వర్యంలో హరిహరక్షేత్రంలో నూతన గ్రామపంచాయితీ పాలకవర్గం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయితీ పాలకవర్గానికి శాలువాలతో ఘన సన్మానం చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో సర్పంచ్ బంగారి రమేష్, ఉపసర్పంచ్ గోలి సుధాకర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పతకాల పంట

## - వివిధ విభాగాల్లో రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకాలను కైవసం చేసుకున్న అధికారులు.. సిబ్బంది.





**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే శౌర్య, మహోన్నత, ఉత్తమ, కఠిన సేవ, సేవా పతకాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ, అంకితభావం, అసమానమైన సేవలందించిన అధికారులకు ఈ విశిష్ట గౌరవం దక్కింది. ఈ జాబితాలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పలువురు ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది పెద్ద సంఖ్యలో పతకాలను సాధించి కమిషనరేట్ కీర్తిని చాటారు.

### తెలంగాణ పోలీస్ మహోన్నత సేవా పతకాలు:

కరీంనగర్ కమిషనరేట్ నుండి కింది ఉన్నతాధికారులు ఈ గౌరవప్రదమైన పతకానికి ఎంపికయ్యారు:

- ఎం. భీంరావు: అడిషనల్ DCP (AR), కరీంనగర్.
- పి. వెంకట రమణ: అడిషనల్ DCP (ADMIN), కరీంనగర్.

### ఉత్తమ సేవా పతకాలు:

విధి నిర్వహణలో అత్యుత్తమ అంకితభావం ప్రదర్శించినందుకు గాను కింది వారు ఎంపికయ్యారు:

- సయ్యద్ అన్వర్ : సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, CTC, కరీంనగర్.
- ఎస్. శ్రీనివాస్ : సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, చిగురుమామిడి పోలీస్ స్టేషన్, కరీంనగర్.
- ఇ. చుక్కా రెడ్డి : హెడ్ కానిస్టేబుల్ (HC 362), CCRB, కరీంనగర్.

### కఠిన సేవా పతకాలు:

- క్లిష్టతరమైన విధులను సమర్థవంతంగా నిర్వహించినందుకు గాను కరీంనగర్ కమిషనరేట్ నుండి కింది అధికారులు, సిబ్బంది ఎంపికయ్యారు:

- ఇన్‌స్పెక్టర్లు & సబ్-ఇన్‌స్పెక్టర్లు:
- టి. కరుణాకర్: ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, హుజూరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్.
- వి. శ్రీనివాస్: ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, CSB, కరీంనగర్.
- ఎ. సత్యనారాయణ: సబ్-ఇన్‌స్పెక్టర్ (SI), I-టౌన్ పోలీస్ స్టేషన్, కరీంనగర్.
- అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్లు (ASI):

ఖాజా జమలుద్దీన్: ASI1094, మానకొండూరు పోలీస్ స్టేషన్.

- సయ్యద్ పాషా: ASI 1482, వీణవంక పోలీస్ స్టేషన్.
- టి. మనోజ్ కుమార్: ASI 1689, రామడుగు పోలీస్ స్టేషన్.
- ఆర్. సమ్మయ్య: ASI1874, చొప్పదండి పోలీస్ స్టేషన్.
- ఎన్. దామోదర చారి: ASI2050, వీణవంక పోలీస్ స్టేషన్.
- గోలాడ సదయ్య: ASI 1822, ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్.
- ఎండి. అంకుషావలి: ARSI, CAR, కరీంనగర్.

-హెడ్ కానిస్టేబుళ్లు (HC):

- పి. శ్రీనివాస్ (HC 2058): రామడుగు పోలీస్ స్టేషన్.
- పి. చంద్రమౌళి (HC 322): గంగాధర పోలీస్ స్టేషన్.
- పి. శ్రీరాములు (HC 1563): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కరీంనగర్.
- బి. అంజయ్య (HC1564): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కరీంనగర్.
- ఇ. తిరుపతి (HC 1580): గన్నేరువరం పోలీస్ స్టేషన్.
- సయ్యద్ అలీముద్దీన్ (HC 977): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కరీంనగర్.
- ఎండి. ఖాజా అజీముద్దీన్ (HC 2097): రామడుగు పోలీస్ స్టేషన్.
- టి. కైలాస్ సింగ్ (HC 2191): కేశవపట్నం పోలీస్ స్టేషన్.
- బి. రవీందర్ రెడ్డి (HC2165): CCRB, కరీంనగర్.
- సిహెచ్. ఆంజనేయులు (HC 2299): కరీంనగర్-I (టౌన్) పోలీస్ స్టేషన్.
- ఎస్. రాంచందర్ (HC2183): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, కరీంనగర్.
- ఎం. మల్లయ్య (HC 2259): హుజూరాబాద్ (టౌన్) పోలీస్ స్టేషన్.
- ఎండి. సుల్తాన్ సలావుద్దీన్ (HC 1965): రూరల్ పోలీస్ స్టేషన్, కరీంనగర్.

-కానిస్టేబుళ్లు (PC/ARPC):

పి. కొమురయ్య (PC 2779): III-టౌన్ పోలీస్ స్టేషన్, కరీంనగర్.

- బి. సత్యనారాయణ (PC 2902): మానకొండూరు పోలీస్ స్టేషన్.
- జి. అంజయ్య (ARPC 2619): CAR, కరీంనగర్.
- కె. లింగారెడ్డి (PC660): చిగురుమామిడి పోలీస్ స్టేషన్.
- పతకాలు సాధించిన ప్రతీ ఒక్కరిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డులు వారి వృత్తిపరమైన బాధ్యతను మరింత పెంచుతాయని , తోటి సిబ్బందికి స్ఫూర్తినిస్తాయని వారు పేర్కొన్నారు.

## మండల కేంద్రాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి.

### - సర్పంచ్ అనూషను సన్మానించినజిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య

**సూర్య జూలపల్లి**



జిల్లాలో జూలపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గ సభ్యులు తమ వంతుగా కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి అనంతుల లచ్చయ్యకు కితాబు ఇచ్చారు. సర్పంచ్ ఉపసర్పంచుల సంయుక్త ఖాతాను వెంటనే తెరవాలని మండల పంచాయతీ అధికారి శేషయ్య సూరికి సూచించారు. చెత్త రహిత గ్రామంగా పారిశుద్ధ్య పనులు చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.అనంతరం ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన గ్రామ సర్పంచ్ పాతకుల అనూషను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో మండలంలో అతి పెద్ద గ్రామపంచాయతీకి సర్పంచుగా ఎన్నికయ్యావు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. పాలకవర్గం అందరిని సమన్వయం చేసుకొని కలిసికట్టుగా ఉండి గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, జిల్లాలోనే ఆదర్శవంతమైన గ్రామంగా నిలిపేందుకు కృషి చేసి గ్రామ అభివృద్ధికి పాటుపడుతూ ప్రజల మన్ననలు పొందాలన్నారు.గ్రామ అభివృద్ధిలో ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలందరికీ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## నర్సాపూర్‌లో గొర్రెకు నట్టల నివారణ మందుల పంపిణీ.

**సూర్య ఎలిగేడు**

మండలం లోని నర్సాపూర్ గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పశువైద్యురాలు ఝాన్సీ తెలిపారు.అందు లో భాగంగా 650 పశువులు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు అందజేశామని చెప్పారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్,ఉప సర్పంచ్ గోసిక రవి,గోపాల మిత్ర సమ్మయ్య, గ్రామ ప్రజలు, యాదవ సంఘం నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో పత్రికల పాత్ర కీలకం.

### - తహసిల్దార్ వహీదుద్దీన్.

**సూర్య సారంగపూర్**



సమాజ అభివృద్ధిలో పత్రికలు కీలకపాత్ర పోషిస్తాయని సారంగాపూర్ తహశీల్దార్ వహీదుద్దీన్ అన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని తహల్దార్ కార్యాలయంలో బుధవారం సూర్య దినపత్రిక 2026 క్యాలెండర్ ను స్థానిక ఎంపీడీవో మహమ్మద్ సలీం తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వహీదుద్దీన్ మాట్లాడుతూ సమాజంలో జరిగే పలు సంఘటనలు ప్రజలకు తెలిసే విధంగా పత్రికలు ప్రధాన పాత్ర పోషిస్తాయని అన్నారు. జిల్లాలోని మండలాల్లో సూర్య దినపత్రిక విలేకరులు క్రమశిక్షణతో పనిచేసి అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందించి ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ప్రజా సమస్యలను తమ కథనాల ద్వారా ఎత్తి చూపుతూ వాటి పరిష్కారానికి చొరవ చూపుతూ ప్రజాప్రతినిధులు అధికారులు మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. ఎంపీడీవో మహమ్మద్ సలీం మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సమాచారం వేగంగా అందుతున్నప్పటికీ వార్తాపత్రికలకు ఉన్న విశ్వసనీయత చెక్కుచెదరలేదని కొనియాడారు. నిష్పక్షపాతంగా వార్తలను అందిస్తూ సూర్య దినపత్రిక తనదైన గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమని అన్నారు. నూతన సంవత్సరంలో అధికారులు ప్రజలు ప్రజాప్రతినిధులతో మమేకమై సూర్య దినపత్రిక మరింత వెలిగి సమాజానికి వెలుతురు పంచాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సూర్య దినపత్రిక విలేకరి కుంటాల గంగాధర్,గ్రామ పాలన అధికారులు బోరిగాం గంగాధర్, కాళ్ల మల్లేష్, కొత్తూరి శ్యామల, కేతం సుధాకర్, కోమల్ల శంకరయ్య,లింగాల సంతోష్, ధరణి ఆపరేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఇద్దరు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారంనాడు కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కంట్రోల్ రూమ్ నుండి ఎస్సై శ్రీనివాస్, ఏ.ఆర్. పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుండి, ఏఆర్ ఎస్సై రాంచందర్ పదవీ విరమణ పొందారు.కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లు వెంకటరమణ , భీంరావు, రిజర్వు ఇన్స్పెక్టర్ (సంక్షేమం) మేడ కిరణ్ కుమార్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కూలీలకు దుస్తులను ఎన్ హెచ్ఆర్సి ఇసి మెంబర్ అందజేత

**సూర్య. ఇల్లంతకుంట.**



మండలంలోని నర్సక్క పేట గ్రామంలో కూలీచేస్తూ జీవిస్తున్న బీహారి రాష్ట్ర కూలీలకు, వారి పిల్లలకు నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఈసీ మెంబర్ అన్నాడి సత్యనారాయణ రెడ్డి దుస్తులను నూతన సంవత్సర కానుకగా బుధవారం అందజేశారు.

## ప్రభుత్వ పాఠశాలలకు సిలిండర్, గ్యాస్ స్టవ్‌లు కంపెనీ

**సూర్య కాల్వ శ్రీరాంపూర్.**



కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రం లోని ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో "ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం వంట కోసం " LPG గ్యాస్ సిలిండర్లు, స్టౌవ్ పాఠశాలలకు సరఫరా చేయగా స్థానిక శ్రీరాంపూర్ గ్రామ సర్పంచ్ బంగారి రమేష్ చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు అత్తె రాజారాం కు అందజేశారు. ఈ సందర్భంగా పాట చాలా విచ్చేసిన సర్పంచ్ బంగారి రమేష్ ను మండల విద్యాధికారి సిరిమల్లె మహేష్, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని కావున పిల్లలు క్రమశిక్షణతో మంచిగా చదువుకోవాలని కోరారు. అలాగే పాఠశాలకు ఏ అవసరం ఉన్న వసతుల విషయంలో నేను సహకరించడానికి ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం సిహెచ్ విజయ్ కుమార్, ఐఆర్పి సుమలత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### - సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ జిల్లాలోని ప్రజలందరూ నూతన సంవత్సరంలో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.గత సంవత్సరంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను పాలక ప్రభుత్వాలు ఈ నూతన సంవత్సరంలో పరిష్కరించాలని, ముఖ్యంగా రైతులు, కార్మికులు, పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రైతు సంక్షేమం ద్వారా సమాజమంతా బాగుపడుతుందని ఆయన అన్నారు.

# కరీంనగర్లో ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఇద్దరు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారంనాడు కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కంట్రోల్ రూమ్ నుండి ఎస్సై శ్రీనివాస్, ఏ.ఆర్. పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుండి, ఏఆర్ ఎస్సై రాంచందర్ పదవీ విరమణ పొందారు.కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ , భీంరావు, రిజర్వు ఇన్స్పెక్టర్ (సంక్షేమం) మేడ కిరణ్ కుమార్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్న కుటుంబానికి అండగా కమాన్పూర్ సర్పంచ్

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సుభాష్నగర్కు చెందిన కౌజుల శ్రీను మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆవేదనలో ఉన్న వారి కుటుంబాన్ని బుధవారం ఉదయం కమాన్పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్న అనంతరం,మానవీయ దృక్పథం తో ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రం గౌడ్, అయిలీ సత్తయ్య, వార్డు సభ్యులు మెరుగు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సి ఎం ను కలిసిన చిగురు నరేష్

**సూర్య, ముస్తాబాద్**



ముస్తాబాద్ మండలం బంధనకల్ గ్రామ నూతన సర్పంచ్ చిగురు నరేష్ తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసి ముందస్తు 2026 నూతన సంవత్సరాది శు భాకాంక్షలు తెలిపారు.

## ఈశ్వర్ రెడ్డి చేసిన సేవలు ఇతరులకు స్ఫూర్తిదాయకం

**సూర్య, హుజురాబాద్**



ఉపాధ్యాయుడుగా తన పదవీ కాలంలో అంకిత భావంతో పనిచేసి పదవీ విరమణ పొందుతున్న పలకల ఈశ్వర్ రెడ్డి సేవలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందుతున్న పి. ఈశ్వర్ రెడ్డి సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ కేంసారపు సమ్మయ్య మాట్లాడుతూ... సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, అలాంటి వృత్తిలో నిబద్ధత కలిగిన ఈశ్వర్ రెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు మరిచిపోలేనివని అన్నారు. హుజురాబాద్ ఎంఈఓ బి. శ్రీనివాస్ మాట్లాడుతూ... తన విద్యుక్త ధర్మాన్ని నిజాయితీగా పనిచేసే ఇతరులకు ఆదర్శంగా ఈశ్వర్ రెడ్డి నిలిచాడని అన్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొరగాల తిరుమల, ఆసియా నందం, స్వామి రావు, అర్చన అవస్థి, శోభారాణి, వేల్పుల రత్నం తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్లో ముందస్తు 2026 నూతన సంవత్సర వేడుకలు

**సూర్య కరీంనగర్**



అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ముందస్తు 2026 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధన కోసం క్రమశిక్షణతో కృషి చేయాలని, తల్లిదండ్రులు పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు వినోదంతో పాటు మానసిక ఉత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన పాలకవర్గానికి ఘన సన్మానం

**సూర్య మల్లాపూర్**



మండలంలోని రేగుంట గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి రాజోజి సాయిరామ్ చారి ఆద్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, ఉపసర్పంచ్ గనవేని నందిని మల్లేష్, పాలకవర్గాన్ని బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు సురకంటి తిరుపతి రెడ్డి, వార్డ్ మెంబర్లు రాజన్న,నరేష్, రాజరెడ్డి, బషీర్, లక్ష్మి,నర్సు,పుష్పలత,లక్ష్మి, మాజీ సర్పంచ్ లు కుందేళ్ళ నర్సయ్య, రంగు రామ గౌడ్, నాయకులు నారాయణ, నరహరి, అశోక్, శేఖర్, రాజేష్, రాకేష్, ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యాబోధన ఉపాధ్యాయుల బాధ్యత.

**- ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్.**

**- టి పి టి ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ.**

**సూర్య జగిత్యాల**



తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల స్కీమ్ లో చర్యలు తీసుకుందన్నారు. పేద మధ్యతరగతి ప్రజల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందనీ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలు,పెన్షనర్స్ సమస్యలు తన దృష్టికి వచ్చాయని పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ప్రభుత్వంలోనే ప్రతి నెలా మొదటి వారంలో జీతాల చెల్లింపు చేయటం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ బోగ రమేష్ ,స్టేట్ కమిటీ సభ్యులు రఘుపతి, రాష్ట్ర ఉపాధ్యాయ నాయకులు సుధ రాజేందర్, జిల్లా అధ్యక్షులు రామచంద్రం, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి కొండగట్టు పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**- జిల్లా ఎస్పి అశోక్ కుమార్**

**సూర్య మల్యాల:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొండగట్టు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా హెలిప్యాడ్ ప్రాంతం, వాహనాల పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ రూట్లు, బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన ముఖ్య ప్రదేశాలు తదితర అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. అనంతరం అక్కడ ఉన్న పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో సమావేశమై, బందోబస్తు పరంగా చేపట్టాల్సిన చర్యలపై పలు కీలక సూచనలు చేశారు.ఉప ముఖ్యమంత్రి పర్యటన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల రాకపోకలు సజావుగా నిర్వహించాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో అదనపు పోలీస్ బలగాలను మోహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ నీలం రవి ఎస్ఐ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గునుకుల కొండాపూర్లో మద్యానికి వ్యతిరేకంగా ప్రజా చైతన్య కార్యక్రమం

**సూర్య గన్నేరువరం**



కరీంనగర్ జిల్లా, మానకొండూరు నియోజకవర్గం, గన్నేరువరం మండలం, గునుకుల కొండాపూర్ గ్రామంలో బుధవారం ప్రతివారం జరిగే కూరగాయల మార్కెట్ సందర్భంగా మద్యానికి వ్యతిరేకంగా ప్రజా చైతన్య కార్యక్రమం ప్రజా నాయకుడు రణం రవన్న నిర్వహించారు .ఎన్నికల సమయంలో గ్రామాల్లో యువత, రైతులు, కూలీలు, పేద ప్రజలకు విచ్చలవిడిగా మద్యం పంపిణీ జరుగుతుండటంతో సమాజం తీవ్రంగా నష్టపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి, మద్యం పంపిణీకి వ్యతిరేకంగా గ్రామ ప్రజలంతా ఐక్యంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

## నూతన సంవత్సరం లో విద్యార్థులు,యువత ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్ళాలి

**- ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్**

**సూర్య కొత్తపల్లి**



విద్యార్థులు ,యువత నూతన సంవత్సరంలో ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలని ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం యువత సామాజిక సేవలో నిరంతరం భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మండల అధికారులను కలిసిన సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి వూట్కూరి శ్రీలత-రాజశేఖర్ రెడ్డి

**సూర్య కొడిమ్యాల**



కొడిమ్యాల మండలంలోని వివిధ శాఖల అధికారులను మండల సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి వూట్కూరి శ్రీలత-రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.మండల తహసీల్దార్ కిరణ్ కుమార్ , మండల అభివృద్ధి అధికారి స్వరూప, సీనియర్ అసిస్టెంట్ సురేష్ , మండల ఐకెపి ఏపిఎం మల్లేశం, వీరా కుమార్ లను వారి వారి కార్యాలయంలో కలిసి. గ్రామమం లోని ప్రజా సమస్యలపై, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రస్తావించారు. గ్రామంలోని త్రాగునీటి సమస్య, పారిశు ధ్య%శీ%, హెల్త్ సెంటర్ పనుల ప్రారంభము, చెప్యాల ఎక్స్ రోడ్ వద్ద తాగునీటి సమస్య, వీధి దీపాలు రోడ్ల మరమ్మత్తుల గురించి విన్నవించారు. గ్రామ సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు. వీరితో పాటు చెప్యాల గ్రామ మాజీ సర్పంచ్ వూట్కూరి రాజశేఖర్ రెడ్డి, ఆర్ టి ఐ జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్, కార్తీక్ రెడ్డి కల్పన ఉన్నారు.

## పెట్రోల్ బంక్ లో దౌర్జన్యం చేసిన వ్యక్తులపై కేసు నమోదు

**ఎండపల్లి సూర్య**



పెట్రోల్ బంక్ లో దౌర్జన్యం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు,, ఎస్సై ఉదయ్ కుమార్ కథనం మేరకు మంగళ వారం రోజున రాత్రి సమయంలో భూపతి నాగరాజు, మరో ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం మత్తులో, ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలోని భారత్ పెట్రోల్ బంకు కు వచ్చి, అక్కడ పని చేస్తున్న వ్యక్తిపై దాడి చేశారని అదే సమయంలో పాఠశాల విద్యార్థులతో కూడిన బస్ రాగా, వారి పట్ల కూడా పై వ్యక్తులు దురుసుగా ప్రవర్తించి, హంగామా సృష్టించారని పెట్రోల్ బంక్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## విద్యాసంస్థల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

**సూర్య, హుజురాబాద్**

నూతన సంవత్సరమును పురస్కరించుకొని బుధవారం హుజురాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు పిల్లలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మరికొన్ని పాఠశాలల్లో పిల్లలు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివేకవర్ధిని, న్యూ శాతవాహన, కేరళ, ఆదర్శ, విజ్ఞాన్, న్యూ కాకతీయ, టెట్రా హెడ్రాన్, కృష్ణవేణి, శస్త్ర పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.